**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 57, పేజీలు - 08

ఆదివారం, ఆగస్టు 23, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# కూలిన భారీ అక్రమ నిర్మాణం

## ఇద్దరు కార్మికులు మృతి

- గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో కూలిన ఏడు అంతస్తుల భవనం..

- అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్నట్లు గుర్తింపు
- టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసైగల్లోనే జోరుగా అక్రమ నిర్మాణాలు..?
- క్షేత్రస్థాయి అధికారులకు ముడుపులిచ్చారంటూ స్థానికుల ఆరోపణలు!
- ప్రమాదాలు జరిగినప్పుడే అధికారుల హడావుడి అంటూ స్థానికుల ఆగ్రహం
- అక్రమ నిర్మాణాలను కట్టడి చేయడంలో రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలం







**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో శనివారం విషాదం చోటుచేసుకుంది. అంజయ్య నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. మాదాపూర్ సర్కిల్ పరిధిలోని అంజయ్య నగర్‌లో ఈ ప్రమాదం సంభవించింది. మృతులను మధ్యప్రదేశ్‌కు చెందిన మోపత్, ఉమేష్‌గా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన రమణారెడ్డిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందిన వెంటనే హైడ్రా, డీఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి.'విక్టిమ్ లొకేషన్ సిస్టమ్' సహాయంతో శిథిలాల నుంచి రెండు మృతదేహాలను వెలికితీసి పోలీసులకు అప్పగించినట్లు ప్రాంతీయ అగ్నిమాపక అధికారి సుధాకర్ రావు తెలిపారు. ప్రమాద సమయంలో భవనంలోకి ఇద్దరు కార్మికులు వెళ్లారని స్థానికులు చెప్పడంతో, శిథిలాల కింద మరెవరైనా చిక్కుకున్నారా అనే కోణంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కేవలం 50 గజాల స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఈ భవనాన్ని అక్రమంగా నిర్మిస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఈ నిర్మాణంపై జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు గతంలోనే నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ, భవన యజమాని ఖాజా క్షేత్రస్థాయి అధికారులకు ముడుపులు చెల్లించి పనులు కొనసాగించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ భవనం పక్కనే ఉన్న వైట్ ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌పైకి ఒరిగి కూలిపోవడంతో ఆ కట్టడం కూడా పాక్షికంగా దెబ్బతింది. ఈ అక్రమ నిర్మాణంపై పొరుగున ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం ఇదే ప్రాంతంలో ఓ ఐదంతస్తుల భవనం ఇలాగే ప్రమాదకరంగా ఒరిగిపోయిన ఉదంతాన్ని స్థానికులు ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు.

### అక్రమ భవనాలన్నీ కూల్చేస్తాం - హైడ్రా రంగనాథ్

ఘటనా స్థలాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సందర్శించారు. ఘటన జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అంజయ్య నగర్‌లో ఇలాంటి భవనాలు చాలా ఉన్నాయన్న రంగనాథ్, నిబంధనలు పాటించకుండా నిర్మించిన భవనాలు, నాలాను ఆక్రమించి కట్టిన వాటిని కూల్చేస్తామని స్పష్టం చేశారు . శనివారం కుప్పకూలిన ఏడు అంతస్తుల భవనాన్ని సాజిద్ అనే బిల్డర్ కట్టినట్లు రంగనాథ్ తెలిపారు. సాజిద్ కట్టిన భవనాలు అన్నీ ఇదే తరహాలో ఉంటున్నట్లు స్థానికులు చెప్తున్నారని కొద్దిరోజుల్లో వాటిని కూల్చేస్తామని తెలిపారు. 50 గజాల స్థలంలో ఏడు అంతస్తుల భవనం నిర్మించడమే కాకుండా పైన పెంట్ హౌస్ కూడా ఏర్పాటు చేస్తున్నారని రంగనాథ్ తెలిపారు. అంజయ్య నగర్‌లో ఇలాంటి భవనాలు ఇంకా ఉన్నాయని చాలావాటికి సెట్‌బ్యాక్‌లు లేవని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని కూల్చేస్తామని స్పష్టం చేశారు. మరోవైపు అంజయ్య నగర్‌లోని భవనాలు హాస్టల్స్ కోసం ఉపయోగిస్తున్నారన్న రంగనాథ్ వాటిని ఖాళీ చేయాలని యజమానులకు సూచించారు. నాలాను ఆక్రమించి భవనాలు కట్టారని అంజయ్య నగర్‌లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని హైడ్రా కమిషనర్ స్పష్టం చేశారు.

### నాలుగు నెలల క్రితమే సీజ్ చేశాం: సీఎంసీ సృజన

అలాగే, ఈ ఘటన గురించి సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన మాట్లాడారు. గతంలోనే ఈ నిర్మాణాలపై తమకు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. నాలుగు నెలల క్రితమే ఈ నిర్మాణ పనులను ఆపేసి, సీజ్ చేశామని వెల్లడించారు. మళ్లీ శుక్రవారం వర్క్ మొదలుపెట్టారని చెప్పారు. నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమయ్యామని అన్నారు. ఈ లోపు ఈ ప్రమాదం చోటు చేసుకుందని చెప్పారు. ఈ నాలాను ఆక్రమించి నిర్మాణలు చేస్తున్నారన్నారు. ఈ బిల్డింగ్ చుట్టూ చాలా అక్రమ నిర్మాణాలు ఉన్నాయని అన్నారు. హాస్టల్ బిల్డింగ్ కోసం ఈ నిర్మాణాన్ని చేపట్టారని సృజన తెలిపారు.

# సుప్రీంకోర్టులో సంచలనం

## - ఒక్క రోజే 400 కేసులు క్లోజ్!



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) సుదీర్ఘకాలంగా కోర్టుల చుట్టూ తిరుగుతూ నలిగిపోతున్న బాధితులకు ఊరటనిచ్చేలా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం సంచలన ఫలితాలను ఇస్తోంది. భారత ప్రధాన న్యాయమూర్తి పర్యవేక్షణలో నిర్వహిస్తున్న 'సమాధాన్ సమారోహ్ 2026' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక లోక్ అదాలత్ తొలి రోజే మైలురాయిని అధిగమించింది. శనివారం ఒక్క రోజే ఏకంగా 400 కంటే ఎక్కువ వివాదాలు సామరస్యపూర్వకంగా పరిష్కారమై రికార్డు సృష్టించాయి.ఈ ప్రత్యేక లోక్ అదాలత్ కోసం సుప్రీంకోర్టు సముదాయంలో ఏకంగా 16 ప్రత్యేక బెంచ్ లను ఏర్పాటు చేశారు. ప్రతీ బెంచ్‌లో ఇద్దరు సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తులతో పాటు సీనియర్ అడ్వకేట్లు, అడ్వకేట్-ఆన్-రికార్డ్ ప్రతినిధులు సభ్యులుగా వ్యవహరించారు. ఈ ధర్మాసనాల ముందుకు తొలిరోజు విచారణ కోసం 600కు పైగా వివిధ రకాల కేసులు రాగా, కక్షిదారుల మధ్య పరస్పర సంభాషణను ప్రోత్సహిస్తూ 400కు పైగా కేసుల్లో ఇరుపక్షాలు ఒక అంగీకారానికి వచ్చేలా న్యాయమూర్తులు, న్యాయవాదులు కీలక పాత్ర పోషించారు. 2లో..

# బీజేపీ కొత్త టీమ్‌తో

# ప్రధాని మోదీ భేటీ


- కొత్త ఆలోచనలతో పార్టీని బలోపేతం చేయాలని బృందానికి దిశానిర్దేశం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ నూతన జాతీయ పదాధికారులతో సమావేశమయ్యారు. కొత్త ఆలోచనలు, దృక్పథాలతో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజలతో పార్టీకి ఉన్న సంబంధాలను మరింతగా పెంచుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. సంస్థాగత సమావేశాలు ఇలాంటి కొత్త ఆలోచనలకు వేదికగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. సమావేశం అనంతరం ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఫొటోలను పంచుకున్నారు. "సంస్థాగత సమావేశాలు పార్టీని బలోపేతం చేయడానికి, ప్రజలతో సంబంధాలు పెంచుకోవడానికి కొత్త ఆలోచనలను అందిస్తాయి. కొత్త బృందంతో సమావేశం అద్భుతంగా జరిగింది," అని ఆయన పేర్కొన్నారు. 2లో..

# కేంబ్రిడ్జ్‌తో తెలంగాణ కొత్త బంధం

## - విద్య, పరిశోధన, స్టార్టప్‌లపై భారీ ప్లాన్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** లండన్ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం ప్రపంచ ప్రఖ్యాత కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ విద్యావేత్తలు, ప్రతినిధులతో కీలక సమావేశం నిర్వహించింది. తెలంగాణలో విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, స్టార్టప్ రంగాల్లో అంతర్జాతీయ స్థాయి భాగస్వామ్యానికి ఉన్న అవకాశాలపై ఇరు వర్గాలు విస్తృతంగా చర్చించాయి. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు విస్తరించేందుకు ఉన్న అనుకూల 2లో..

# మహిళలు ఎవరికీ బానిసలు కారు

## - మనుస్మృతి భావజాలంపై రాహుల్ గాంధీ ఫైర్

2లో..





## త్వరలోనే అనకాపల్లి, విశాఖకు

# గోదావరి నీళ్లు తెస్తాం

## - సీఎం చంద్రబాబు కీలక ప్రకటన!

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుస్థిర పారిశ్రామికాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సురక్షిత తాగునీరు సరఫరాలను సమతుల్యం చేస్తూ కూటమి ప్రభుత్వం సువర్ణ అధ్యాయానికి చుట్టబోతున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల దాహార్తిని తీరుస్తూ, రాబోయే సెప్టెంబర్ మొదటి వారంలో అనకాపల్లి, విశాఖ పట్నం జిల్లాలకు పవిత్ర గోదావరి జలాలు రప్పిస్తామని అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అనకాపల్లి జిల్లా కే. కోటపాడు మండలం ఏ కోడూరు గ్రామంలో నిర్వహించిన బహిరంగ ప్రజావేదిక సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి ఉత్తారంధ్ర సమగ్ర అభివృద్ధికి సంబంధించిన భవిష్యత్ కార్యాచరణను ప్రజల ముందు పెట్టారు. అనకాపల్లిని కేవలం ఒక సంప్రదాయ బెల్లం మార్కెట్‌గా మాత్రమే కాకుండా దేశంలోని అగ్రగామిగా నిలిచే నంబర్ వన్ పారిశ్రామిక సామ్రాజ్యంగా తీర్చిద్దిద్దే బాధ్యతను తాము భుజానికి ఎత్తుకున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వంటి అంతర్జాతీయ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను తీసుకు వస్తుంటే కొందరు స్వార్థ రాజకీయ శక్తులు చేస్తున్నప్పుడు తప్పుడు ప్రచారాలను ఆయన తనదైన శైలిలో 2లో..

## డీఎస్సీపై చర్చకు రా..

# టైమ్, డేట్ నీ ఇష్టం!

## - జగన్‌కు నారా లోకేశ్ ఐదోసారి సవాల్



అమరావతి (ప్రశ్న న్యూస్) డీఎస్సీ నియామకాలపై చర్చకు రావాలంటూ వైసీపీ అధినేత జగన్ కు తాను ఐదోసారి సవాల్ విసురుతున్నానని, దమ్మުంటే చర్చకు రావాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరారు. "టైమ్, డేట్ నువ్వే ఫిక్స్ చెయ్, డీఎస్సీపై చర్చకు నేను సిద్ధం. తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చోవడం 2లో..

## నన్ను, నా ఫ్యామిలీని టార్గెట్ చేస్తున్నారు..

# చర్యలు తీసుకోండి

- టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ మరో లేఖ
- తనను, తన కుటుంబాన్ని కొందరు నేతలు లక్ష్యంగా చేసుకున్నారని ఆవేదన
- విచారణ జరుగుతుండగా బహిరంగ విమర్శలు చేయడం సరికాదని సూచన
- ముఖ్యమంత్రిపై కుమార్తె వ్యాఖ్యలను సురేఖ ఖండించాలని చెప్పిన మల్లు రవి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) టీపీసీసీ క్రమశిక్షణా కమిటీకి మంత్రి కొండా సురేఖ తాజాగా మరో లేఖ రాశారు. తనను, తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని అవమానకరంగా వ్యాఖ్యలు చేయిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. వారి వెనుక ఉన్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే క్రమశిక్షణ కమిటీకి వివరణ ఇచ్చినా తనపై, తన కుటుంబ సభ్యులపై కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. 2లో..

## ఎయిర్‌పోర్ట్ తరహాలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

### - ప్రయాణికుల వాహనాల కోసం 200 ఈవీ ఛార్జింగ్ పాయింట్లు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రూ.714.73 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టును ఎయిర్‌పోర్ట్ తరహా ప్రపంచస్థాయి సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నారు. పనులు పూర్తయిన తర్వాత డిసెంబర్ నుంచి ప్రయాణికులకు ఆధునిక వసతులు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం రోజుకు సుమారు 1.5 లక్షల మంది ప్రయాణికులు సికింద్రాబాద్ స్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. 2లో..

# సుప్రీంకోర్టులో సంచలనం

## కుటుంబ వివాదాల నుంచి పన్నుల కేసుల వరకు!

ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పలు రకాల సున్నితమైన కేసులను విచారణకు స్వీకరించారు. భార్యాభర్తల మధ్య వైవాహిక వివాదాలు, ఆస్తి తగవులు, మోటారు వాహన ప్రమాద నష్టపరిహారం పిటిషన్లు, భూసేకరణ–పరిహారం వివాదాలతో పాటు పన్నులకు సంబంధించిన కేసులు, సర్వీస్, లేబర్ వివాదాలను ఇందులో పరిష్కరించారు. ఏప్రిల్ 21న 'సమాధాన్ సమారోహ్' ప్రారంభమైనప్పటి నుంచి కక్షిదారులు, వారి తరఫు న్యాయవాదులతో ముందుగానే చర్చలు జరిపి ఒప్పంద అవకాశాలను అంచనా వేయడం వల్లే ఈ స్థాయిలో కేసులు పరిష్కారమయ్యాయని కోర్టు తెలిపింది.

### కోర్టుల భారం తగ్గడమే లక్ష్యం

ఏళ్ల తరబడి సాగే న్యాయపోరాటాలు కక్షిదారులపై మోపే ఆర్థిక, మానసిక భారాలను తగ్గించడమే ఈ లోక్ అదాలత్ ప్రధాన ఉద్దేశం. సంప్రదింపులు, పరస్పర అంగీకారం ద్వారా సమస్యల పరిష్కార యంత్రాంగాన్ని బలోపేతం చేయాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. ప్రత్యామ్నాయ వివాద పరిష్కార వ్యవస్థలను ప్రోత్సహించడం ద్వారానే త్వరితగతిన న్యాయం అందించవచ్చని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఆగస్టు 23 వరకు కొనసాగే ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ముగింపుతో 'సమాధాన్ సమారోహ్ 2026' విజయవంతంగా పూర్తి కానుంది.

# బీజేపీ కొత్త టీమ్‌తో ప్రధాని మోదీ భేటీ

పార్టీ కార్యాలయానికి విచ్చేసిన ప్రధానికి బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ స్వాగతం పలికారు. ఈ వారం మొదట్లో ప్రకటించిన నితిన్ నబిన్ కొత్త జాతీయ బృందంతో ప్రధాని మోదీ భేటీ కావడం ఇదే తొలిసారి. ఈ కొత్తగా నియమించిన 65 మంది సభ్యుల బృందంలో 51 మంది కొత్త ముఖాలకు అవకాశం కల్పించడం గమనార్హం. రాబోయే రోజుల్లో చేపట్టబోయే పలు సంస్థాగత, ప్రజా సంబంధ కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా యువతతో మమేకం కావడమే లక్ష్యంగా 'యువ సంవాద్' (యువతతో సంప్రదింపులు) కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. 14 ఏళ్లు పైబడిన యువతను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఈ కార్యక్రమాల సమన్వయ బాధ్యతను భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం)కు అప్పగించారు. అలాగే, రాబోయే ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై కూడా దృష్టి సారించారు. దీనిపై సమీక్షించేందుకు ఆదివారం పార్టీ అధ్యక్షుడు నితిన్ నబిన్.. రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు, సంస్థాగత ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌ఛార్జ్‌లతో మరో సమావేశం నిర్వహించనున్నారు.

### 'వందేమాతరం'పై బీజేపీ తీర్మానం

ఇదే సమయంలో, 'వందేమాతరం' గౌరవాన్ని, చారిత్రక వారసత్వాన్ని కాపాడతామంటూ బీజేపీ శనివారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. 1937 నాటి తీర్మానానికి కట్టుబడి, జాతీయ గీతంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలన్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా విమర్శించింది. మతపరమైన ఒత్తిళ్లు, రాజకీయ బుజ్జగింపులు, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వందేమాతరాన్ని కుదించే ప్రయత్నాలను వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. వందేమాతరం చరిత్ర, ప్రాముఖ్యతపై దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించింది.

## త్వరలోనే అనకాపల్లి, విశాఖకు

# గోదావరి నీళ్లు తెస్తాం



తిప్పి కొట్టారు. అభివృద్ధిని అడ్డుకోవాలని చూసే శక్తులు ఎన్ని కుట్రలు చేసినా ప్రజా సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వ ప్రయాణం సాగుతుందని తేల్చి చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలను, దీర్ఘకాలిక మౌలిక వసతుల అభివృద్ధిని సమతుల్యం చేస్తూ స్వర్ణాంధ్ర సుస్థిర ప్రస్థానాన్ని ముందుకు తీసుకెళ్తామని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షాలు లేక భూగర్భ జలాలు పడిపోయి పలు ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి కఠిన పరిస్థితులపై ప్రభుత్వం నిరంతరం సమీక్షలు జరుపుతూ, తాత్కాలిక ఉపశమన చర్యలతోపాటు దీర్ఘకాలిక శాశ్వత పరిష్కారాల వైపు అడుగులు వేస్తోందన్నారు. ఇందులో భాగంగానే, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల తాగునీటి ఎద్దడికి శాశ్వత ముగింపు పలకడానికి గోదావరి నది నుంచి సురక్షిత జలాలను సెప్టెంబర్ మొదటి వారంలో రప్పిస్తామని సభా ముఖంగా చెప్పారు." అనకాపల్లి జిల్లా పరిధిలోని ప్రతి చెరువును, ప్రతి రిజర్వాయర్‌లు జలకళతో నింపే పూర్తి బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుంది. ఇక్కడి ప్రజలకు రైతులకు నీటి కొరత లేకుండా చూస్తాం." అని ముఖ్యమంత్రి ప్రకటించారు. నీరు అత్యంత విలువైన వనరు అని, చుక్క నీరు కూడా వృథా కాకుండా జలవనరులను కాపాడుకోవాలని పర్యావరణ సమతుల్యతను సాధించడమే నిజమైన అభివృద్ధి అని ఈ సందర్భంగా ఆయన ప్రజలకు హితబోధ చేశారు.
అనకాపల్లి జిల్లా పారిశ్రామిక రూపాంతరాన్ని వివరిస్తూ, ఒకప్పుడు ప్రాంతం కేవలం ప్రసిద్ధ బెల్లం మార్కెట్‌గా మాత్రమే గుర్తింపు పొందిందని సీఎం గుర్తు చేశారు. కానీ రాబోయే రోజుల్లో అనకాపల్లి రూపురేఖలు పూర్తిగా మారిపోబోతున్నాయని, ఇది దేశంలోనే నంబర్ వన్ ఇండస్ట్రియల్ హబ్‌గా అవతరించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం విశాఖపట్నం కంటే వేగంగా అనకాపల్లికి పారిశ్రామిక పెట్టుబడులు వస్తున్నాయని ఇక్కడ ఒక్క భారీ స్టీల్ సిటీ నిర్మాణం కాబోతోందని వెల్లడించారు.

### గూగుల్ డేటా సెంటర్ వివాదంపై ఫైర్

విశాఖలో అంతర్జాతీ గూగుల్ డేటా సెంటర్ తీసుకొస్తే అవగాహన లేని వారంతా దుష్ప్రచారం చేస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. డేటా సెంటర్ ఇంకా పూర్తి కాకుండానే భూగర్భ జలాలు ఎండిపోతున్నాయని, తాగు నీరు లేదంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఆగస్టు 31న వెలిగొండ ప్రారంభం

రాష్ట్ర నీటిపారుదల రంగానికి సంబంధించి సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న వెలిగొండ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి అత్యంత కీలకమైన ప్రకటన చేశారు. అసాధ్యమని ఎందరో భావించిన 30 ఏళ్లుగా అరిష్కృతంగా మిగిలిపోయిన వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని తమ పట్టుదలతో సాధ్యం చేసి చూపించామని హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 31 వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు మొదటిదశను అధికారికంగా ప్రారంభించబోతున్నట్టు ప్రకటించారు.

### పర్యావరణ పరిరక్షణే నిజమైన అభివృద్ధి: చంద్రబాబు

స్వచ్ఛత లేని చోట ఆరోగ్య ఉండని, ఆరోగ్యకరమైన జీవనానికి స్వచ్ఛత అత్యంత కీలకమని చంద్రబాబు అన్నారు. అభివృద్ధి అంటే కేవలం పరిశ్రమలు, కంపెనీలు, పెట్టుబడులు రప్పించడం మాత్రమే కాదని, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛమైన వాతావరణం కూడా అభివృద్ధిలో ప్రధాన భాగమని స్పష్టం చేశారు. మన ఊరు– మన బాధ్యత అనే సంకల్పాన్ని ప్రతి ఒక్కరూ స్వీకరించి స్వచ్ఛత వైపు అడుగులు వేయాలని కోరారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం జీరో వేస్ట్ పంచాయితీగా రూపాంతరం చెందాలని సీఎం ఆకాంక్షించారు. గ్రామాల్లోని చెత్తను సమర్థవంతంగా తొలగించారు. చెత్తను వ్యర్థంగా పారేయకుండా, దాని నుంచి కంపోస్ట్ ఎరువులు, విద్యుత్, గ్యాస్ ఉత్పత్తి చేసే వినూత్న సాంకేతికతను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు అమర్చుకుంటే కరెంటు బిల్లుల ఖర్చు ఉండదని, పీఎం సూర్యఘర్ రూఫ్‌టాప్ సోలార్ పథకం ద్వారా ప్రతి ఇల్లు ఒక చిన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మారాలని ఆకాంక్షించారు. ఇందులో తూర్పుప్రాంత విద్యుత్ ఉత్పత్తి పంపిణీ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని గుర్తు చేశారు

# మహిళలు ఎవరికీ బానిసలు కారు

పూణే (ప్రశ్న న్యూస్) లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ, పితృస్వామ్య భావజాలంపై, ముఖ్యంగా 'మనుస్మృతి' నిర్దేశించిన పరిమితులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశానికి అసలైన బలం, ఆస్తి 70 కోట్ల మంది మహిళలేనని ఆయన స్పష్టం చేశారు. శనివారం పుణెలో "ఛాత్రోం కీ గూంజ్" కార్యక్రమంలో భాగంగా 'పింజ్రా తోడా' (పంజరాన్ని బద్దలుకొట్టండి) అనే థీమ్‌తో విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ "దేశానికి అతిపెద్ద బలం ఏమిటని అడిగితే ఆర్థిక వ్యవస్థ, సైన్యం, జనాభా అంటూ రకరకాల సమాధానాలు చెబుతారు. కానీ నా దృష్టిలో భారతదేశానికి ఉన్న 70 కోట్ల మంది మహిళలే దేశానికి అతిపెద్ద శక్తి" అని అన్నారు. మహిళలు ఎవరికీ బానిసలు కారని ఉద్ఘాటించారు. బాల్యంలో ఉన్నప్పుడు తండ్రికి పనులు చేసిపెట్టడం కోసం, యవ్వనంలో భర్త కోసం, ఆ తర్వాత వృద్ధాప్యంలో కొడుకుల కోసం మహిళలు బతకాలనే మనుస్మృతి భావజాలం సిగ్గుచేటని విమర్శించారు. కుమార్తె, భార్య, తల్లి వంటి పాత్రలకే పరిమితం కాకుండా మహిళలు తమకంటూ ఒక సొంత గుర్తింపును ఏర్పరచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిషా అనే గిరిజన విద్యార్థిని ప్రసంగం అందరినీ కదిలించింది. గిరిజన విద్యార్థుల సమస్యలను ఆమె రాహుల్ గాంధీ దృష్టికి తీసుకొచ్చారు. పుణేలోని మంజరి ప్రాంతంలో తమ డిమాండ్ల సాధన కోసం గిరిజన విద్యార్థులు నిరాహార దీక్ష చేస్తున్నారని, వారి దుస్థితిని వివరిస్తూ ఒక వినతిపత్రాన్ని అందజేశారు. గిరిజన హాస్టళ్లలో కనీస వసతులు లేవని, 70–80 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేంద్రీకృత వంటశాలల నుంచి ఆహారం సరఫరా చేయడం వల్ల అది పాడైపోయి విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల గడ్చిరోలిలోని ఆశ్రమ పాఠశాలలో పాముకాటు కారణంగా ముగ్గురు విద్యార్థులు మరణించగా, మరో ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని నిషా తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, సెలవులకు ఇంటికి వెళ్లి తిరిగి వచ్చిన గిరిజన విద్యార్థినులకు హాస్టళ్లలో బలవంతంగా గర్భ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని చెప్పడంతో సభలో నిశ్శబ్దం అలుముకుంది. ఈ సమస్యలపై మంత్రులను కలిస్తే ముఖ్యమంత్రి చేతుల్లోనే ఉందని చేతులెత్తేశారని, అలాంటప్పుడు వారికి పదవిలో ఉండే అర్హత లేదని ఆమె నిలదీశారు. విద్యార్థిని ఆవేదనకు స్పందించిన రాహుల్ గాంధీ, వారి నిరసన శిబిరానికి తనను ఆహ్వానించమని కోరారు. "నన్ను నిరసన స్థలానికి పిలవండి, నేను తప్పకుండా వస్తాను. నా రాకతో ప్రభుత్వం, యంత్రాంగంపై ఒత్తిడి పెరుగుతుంది" అని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర నలుమూలల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కూడా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందురోజు ఏబీవీపీ, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తల మధ్య ఘర్షణలు జరిగిన నేపథ్యంలో పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేయడంతో ఈవెంట్ ప్రశాంతంగా ముగిసింది.

# కేంబ్రిడ్జ్‌తో తెలంగాణ కొత్త బంధం

పరిస్థితులను కేంబ్రిడ్జ్ ప్రతినిధులకు తెలంగాణ బృందం వివరించింది. హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి విజ్ఞాన, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న తెలంగాణ ప్రభుత్వ లక్ష్యానికి ప్రపంచంలోని ప్రముఖ విద్యాసంస్థలు భాగస్వాములు కావాలని సీఎం కోరినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా విద్యా కార్యక్రమాలు, పరిశోధన ప్రాజెక్టులు, యువ పారిశ్రామికవేత్తలకు ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధి వంటి రంగాల్లో కేంబ్రిడ్జ్ సహకారం అందించాలని ప్రతిపాదించారు. కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌లో భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని మార్కెటింగ్ చైర్ ప్రొఫెసర్ జైదీప్ ప్రభు, అదే సంస్థకు చెందిన ప్రొఫెసర్ వెంకట సిరీష్ గండికోట తెలంగాణతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. తెలంగాణలో అందుబాటులో ఉన్న అవకాశాలపై వారు సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు నిర్వహించడం, సంయుక్త పరిశోధనలు చేపట్టడం, యువతలో వ్యాపార ఆలోచనలను ప్రోత్సహించడం, స్టార్టప్‌లకు అవసరమైన ఇంక్యుబేషన్, మెంటరింగ్, అభివృద్ధి సహకారం అందించడం వంటి అంశాలపై ఇరు పక్షాలు చర్చించాయి. ఈ రంగాల్లో ముందుకు వెళ్లేందుకు ప్రత్యేక సహకార వ్యవస్థ, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని నిర్ణయించినట్లు అధికారులు వెల్లడించారు. కేంబ్రిడ్జ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థతో భాగస్వామ్యం ఏర్పడితే తెలంగాణలో ఉన్నత విద్య, పరిశోధన, ఆవిష్కరణ రంగాలకు అంతర్జాతీయ గుర్తింపు మరింత పెరిగే అవకాశం ఉంది. హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న 'తెలంగాణ రైజింగ్' లక్ష్యానికి ఈ భేటీ కీలక ముందడుగుగా ప్రభుత్వం భావిస్తోంది.

# డీఎస్సీపై చర్చకు రా..

# టైమ్, డేట్ నీ ఇష్టం!

కాదు, బయటకు రా!" అని లోకేశ్ తీవ్ర స్వరంతో జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. శనివారం విజయనగరం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీకి మధ్య తేడా కూడా తెలియని వ్యక్తి ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఎలా పనిచేశారని ఆయన ఎద్దేవా చేశారు

."ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయని జగన్, ఇప్పుడు మేం పారదర్శకంగా భర్తీ చేసిన 16 వేల ఉద్యోగాలపై దుష్ప్రచారం చేస్తున్నారు. వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లు అంటే కూడా ఆయనకు అవగాహన లేదు. అసెంబ్లీలో వారి ఆరోపణలకు సమాధానం చెప్పినా, బయటకు వచ్చి మళ్ళీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. కష్టపడి టెట్, డీఎస్సీ రాసి ఎంపికైన ఉపాధ్యాయులను అవమానించడం మానుకోవాలి" అని లోకేశ్ హితవు పలికారు. జగన్ చెప్పే అబద్ధాలను కార్యకర్తలు బలంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

### కార్యకర్తలే పార్టీకి బలం

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని, వారి త్యాగాల పునాదులపైనే పార్టీ నిలబడి ఉందని స్పష్టం చేశారు. "కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పించే బాధ్యత నాది. కార్యకర్తలు నన్ను వెతుక్కుంటూ రావాల్సిన పనిలేదు. కష్టపడే వారిని నేనే వెతుక్కుంటూ వస్తాను" అని ఆయన భరోసా ఇచ్చారు. కార్యకర్తల సంక్షేమం కోసం రూ.160 కోట్లు ఖర్చు చేసిన ఏకైక పార్టీ టీడీపీ అని గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను న్యాయబద్ధంగా తొలగిస్తామని, ఇప్పటికే 75 శాతం కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న నీరు–చెట్టు బిల్లుల సమస్యను కూడా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

### ఉత్తరాంధ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

గత ఎన్నికల్లో ఉత్తరాంధ్ర ప్రజలు కూటమికి అఖండ విజయాన్ని అందించారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని లోకేశ్ అన్నారు.

"భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, రైల్వే జోన్ ఏర్పాటు వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. టీసీఎస్, కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ కంపెనీలను ఉత్తరాంధ్రకు తీసుకువచ్చి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం" అని హామీ ఇచ్చారు. అయితే, వైసీపీ ఎంపీ గురుమూర్తి కాగ్నిజెంట్ సంస్థకు భూ కేటాయింపును అడ్డుకోవాలని కోర్టును ఆశ్రయించడం వారి అభివృద్ధి నిరోధక వైఖరికి నిదర్శనమని విమర్శించారు.

### అదితి గజపతిరాజుపై ప్రశంసలు

విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం తపిస్తారని లోకేశ్ ప్రశంసించారు. "అసెంబ్లీలో అదితి గారు రోజుకు మూడుసార్లైనా నా వద్దకు వచ్చి నియోజకవర్గ సమస్యల గురించే మాట్లాడతారు.

జీఎంఆర్–మాన్సాస్ ఎడ్యూసిటీ కోసం గజపతి రాజుల కుటుంబం 150 ఎకరాలు ఉచితంగా ఇవ్వడం వారి దాతృత్వానికి నిదర్శనం" అని కొనియాడారు. సీనియర్ నేత అశోక్ గజపతిరాజు గురించి మాట్లాడుతూ, "ఆయన నానో కారులో తిరిగినా, ఆయన రాజసం రోల్స్ రాయిస్ లాంటిది. గత ప్రభుత్వం ఆయనను ఎన్నో ఇబ్బందులు పెట్టింది. ఎన్ని కేసులు పెట్టినా మా నాయకులకు బలమే కానీ బలహీనత కాదు" అని వ్యాఖ్యానించారు. రప్ప రప్ప బ్యాచ్‌కు నో ఎంట్రీ, స్థానిక ఎన్నికలకు సిద్ధం కండివైసీపీ నుంచి టీడీపీలోకి రావాలనుకునే వారికి పార్టీలో స్థానం లేదని లోకేశ్ తేల్చిచెప్పారు. "రప్ప రప్ప అంటే చూస్తూ ఊరుకోం. చట్టాన్ని ఉల్లంఘిస్తే బొక్కలో వేసే బాధ్యత నాది. రెడ్ బుక్ దాని పని అది చేసుకుపోతుంది.

పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారికి ఇక్కడ హౌస్‌ఫుల్ బోర్డు పెట్టేశాం" అని హెచ్చరించారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని సూచించారు.
పంచాయతీ నుంచి ఢిల్లీ వరకు కూటమి ప్రభుత్వాలు ఉంటేనే అభివృద్ధి వేగవంతం అవుతుందని, కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేసి అద్భుత విజయాలు సాధించాలని కోరారు. అనంతరం, సమావేశానికి హాజరైన ప్రతి కార్యకర్తతో ఆయన ఫొటో దిగారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# నన్ను, నా ఫ్యామిలీని టార్గెట్ చేస్తున్నారు.. చర్యలు తీసుకోండి

'నన్ను తిడుతున్న వ్యక్తుల వెనుక అదృశ్య శక్తి ఉంది' ఆ అదృశ్య శక్తిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలి.. అని టీపీసీసీ క్రమశిక్షణా కమిటీకి రాసిన లేఖలో మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. తనను, తన కుటుంబ సభ్యుల్ని లక్ష్యంగా చేసుకుని కొందరు కాంగ్రెస్ పార్టీ నేతలు అవమానకర రీతిలో వ్యాఖ్యలు చేస్తున్నారని, ఆ నేతల వెనుక ఉండి ఈ వ్యవహారం నడుపుతున్న వ్యక్తులు గుర్తించి, చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవికి విజ్ఞప్తి చేశారు. విచారణ జరుగుతున్న సమయంలోనే తనపై ఇలా విమర్శలు చేయడం, రాజకీయ భవిష్యత్తుపై తీర్పు ఇవ్వడం, కమిటీ స్వతంత్ర నిర్ణయాన్ని ప్రభావితం చేసే ప్రయత్నంగా పరిశీలించాలని కోరారు. మరోవైపు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ ఎంపీ మల్లు రవి కీలక వ్యాఖ్యలు చేశారు. గాంధీ భవన్ లో క్రమశిక్షణ కమిటీ భేటీ కొద్దిసేపటి క్రితమే ముగిసిందని అన్నారు. మూడు అంశాలపై ప్రధానంగా చర్చించినట్లు తెలిపారు. కొండా సురేఖ నుంచి రిప్లై వచ్చిందని కొండా సురేఖ వివరణపై మరోసారి సమావేశం అవుతామని అన్నారు. 'కొండా సుస్మిత మాట్లాడిన వీడియోలను చూశాం, సీఎంపై కొండా సుస్మిత అనుచిత వ్యాఖ్యలు చేశారు, సీఎల్పీలో ఎమ్మెల్యేలు మాట్లాడిన వీడియోలు చూశాం, ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేస్తామన్నారు, అందరి ఫిర్యాదులు తీసుకున్నాక మరోసారి భేటీ అవుతామని క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి స్పష్టం చేశారు. మరోవైపు కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ అంశాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్ గా తీసుకొన్నట్లు తెలుస్తోంది. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులు ఇవ్వడంతో పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

# ఎయిర్‌పోర్ట్ తరహాలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

రోజూ దాదాపు 180 రైళ్లు ఈ స్టేషన్‌కు వచ్చి వెళ్తున్నాయి. ఆధునీకరణ తర్వాత ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండటంతో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను రూపొందిస్తున్నారు. స్టేషన్ పునరాభివృద్ధిలో భాగంగా పార్కింగ్ సదుపాయాలపైనా ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో భారీ సంఖ్యలో ఈవీ ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికులు తమ వాహనాలను పార్క్ చేయడంతో పాటు ఛార్జింగ్ చేసుకునేలా పార్కింగ్ ప్రాంతాల్లోనే ప్రత్యేక మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. బోయిగూడ వైపు బేస్‌మెంట్ పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాంతంలోనే 120 ఈవీ ఛార్జింగ్ పాయింట్లు అందుబాటులోకి రానున్నాయి. వీటిలో 100 పాయింట్లు నాలుగు చక్రాల ఎలక్ట్రిక్ వాహనాల కోసం, మరో 20 పాయింట్లు ద్విచక్ర వాహనాల కోసం కేటాయించారు. దీంతో రైల్వే స్టేషన్‌కు కార్లు, బైక్‌లపై వచ్చే ప్రయాణికులకు ఒకేచోట పార్కింగ్‌తో పాటు ఛార్జింగ్ సదుపాయం లభించనుంది. మరోవైపు గణేశ్ టెంపుల్ వైపు మల్టీ లెవెల్ పార్కింగ్ సదుపాయాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో 80 ఈవీ ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయనున్నారు. నాలుగు చక్రాల వాహనాల కోసం 60, ద్విచక్ర వాహనాల కోసం 20 ఛార్జింగ్ పాయింట్లు కేటాయించారు. బోయిగూడ, గణేశ్ టెంపుల్ పార్కింగ్ ప్రాంతాలను కలిపితే సికింద్రాబాద్ స్టేషన్ పరిసరాల్లోనే మొత్తం 200 ఈవీ ఛార్జింగ్ పాయింట్లు అందుబాటులోకి రానున్నాయి. రైల్వే స్టేషన్ పునరాభివృద్ధిలో భాగంగా ప్రయాణికుల సౌకర్యాలతో పాటు పర్యావరణహిత రవాణాకు ప్రాధాన్యం ఇవ్వడం కూడా ఈ ప్రాజెక్టులోని ముఖ్యాంశంగా మారింది. భవిష్యత్‌లో పెరిగే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుగానే ఛార్జింగ్ మౌలిక వసతులను ఏర్పాటు చేయడం ద్వారా స్టేషన్ ప్రాంతాన్ని ఈవీ ఫ్రెండ్లీ ట్రాన్స్‌పోర్ట్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. సికింద్రాబాద్‌తో పాటు నగరంలోని ఇతర రైల్వే స్టేషన్లలోనూ ఈవీ ఛార్జింగ్ సదుపాయాలను విస్తరిస్తున్నారు. హైటెక్ సిటీ, నెక్లెస్ రోడ్, ఫిరోజ్‌గూడ, సుచిత్ర సర్కిల్, నేరేడ్‌మెట్, హఫీజ్‌పేట్, బేగంపేట్, ఉమ్దానగర్, సీతాఫల్‌మండి స్టేషన్లలో కూడా ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. దీంతో రైల్వే ప్రయాణికులు తమ ఎలక్ట్రిక్ వాహనాలను ఛార్జ్ చేసుకునే అవకాశాలు నగరవ్యాప్తంగా పెరుగుతున్నాయి. సికింద్రాబాద్ స్టేషన్ ఆధునీకరణ పూర్తయిన తర్వాత రైళ్ల సంఖ్య, ప్రయాణికుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున పార్కింగ్, వాహన ఛార్జింగ్, ప్రయాణికుల నిర్వహణ వంటి అంశాలకు ఇప్పటి నుంచే ప్రాధాన్యం ఇవ్వడం కీలకంగా మారింది. ప్రపంచస్థాయి ప్రయాణికుల సౌకర్యాలతో పాటు భవిష్యత్ రవాణా అవసరాలకు అనుగుణంగా ఈ స్టేషన్‌ను అభివృద్ధి చేయడమే ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

# ఎస్వీబీసీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన శ్రీధర్ వర్మ

## ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పులివర్తి నాని



తిరుపతి(ప్రశ్న న్యూస్) నూతన ఎస్వీబీసీ చైర్మన్‌గా నియమితులైన శ్రీధర్‌వర్మ ప్రమాణ స్వీకారోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరయ్యారు ఎస్వీబీసీ కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే పులివర్తి నానికి నూతన చైర్మన్ శ్రీధర్‌వర్మ, కూటమి నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్‌వర్మను ఎమ్మెల్యే పులివర్తి నాని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు
ఎస్వీబీసీ ద్వారా శ్రీవారి సేవలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను మరింత విస్తృతంగా భక్తులకు చేరువ చేయాలని ఆకాంక్షించారు. చైర్మన్‌గా శ్రీధర్‌వర్మ విజయవంతంగా బాధ్యతలు నిర్వహించాలని పులివర్తి నాని అభిలషించారు. కార్యక్రమంలో కూటమి నేతలు, టీటీడీ అధికారులు, ఎస్వీబీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సబ్ ఇన్స్పెక్టర్ నిర్మల వెంకన్న దర్యాప్తు తీరు భేష్

## -మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ సుమతి



కాప్రా(ప్రశ్న న్యూస్ )కుషాయిగూడ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ వెంకన్నకు ఉత్తమ దర్యాప్తు అధికారిగా పురస్కారం అందిస్తున్న కమిషనర్ సుమతి. కుషాయిగూడ, ఆగస్టు 22న కేసును రిజిస్టర్ చేయడం నుండి మొదలుకొని ఛేదించి శిక్ష పడే వరకు తన ప్రతిభను కనబరిచిన కుషాయిగూడ సబ్ ఇన్స్పెక్టర్ నిర్మల వెంకన్న సేవలను గుర్తించి మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ సుమతి బెస్ట్ ఇన్వెస్టిగేషన్ అధికారిగా పురస్కారాన్ని అందించారూ. నేరేడ్మెట్ లోని మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేశారు. ఉన్నతాధికారులు ప్రశంసించడంతోపాటు ఆయన సేవలను ప్రజలు కొనియాడుతున్నారు. గతంలో జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ లో పనిచేసిన సమయంలో కరడుగట్టిన భూకబ్జాదారులు రౌడీషీటర్ల నుండి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దూరం చేయడానికి నిర్భయంగా భూకబ్జాదారులపై పీడీ యాక్ట్ విధించి కట్టి భూకబ్జాదారులను చర్లపల్లి జైలుకు పంపించిన ఉత్తమ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్గా సైతం ఎస్సై వెంకన్నకు గుర్తింపు లభించిన విషయం విధితమే. విధి నిర్వహణలో ప్రజల న్యాయం చేయడంతో పాటు ఉన్నతాధికారుల మన్ననలను పొందడం ఆయనకు పరిపాటిగా మారింది.

## పబ్లిక్ ని పరిషాన్ చేయొద్దు బోర్డు ఎక్స్ విపి : ఆర్కే



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వ భూముల వినియోగం పారదర్శకంగా ఉండేలా అధికారిక రికార్డులు,భౌతిక పరిశీలన ఆధారంగా వాస్తవాలు వెలుగులోకి రావాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జే.రామకృష్ణ పేర్కొన్నారు.తెలంగాణ హైకోర్టులో విచారణలో ఉన్న డబ్ల్యు.పి నెంబర్. 24635 ఆఫ్ 2026కు సంబంధించిన అంశంపై శనివారం వార్డు-2, రసూల్‌పురలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నగర్‌ను అడ్వకేట్ కమిషనర్ సందర్శించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజల పిలుపుమేరకు అక్కడికి చేరుకున్న జే.రామకృష్ణ, అడ్వకేట్ కమిషనర్‌కు పలు కీలక అంశాలను వివరించడంతో పాటు మెమొరాండం సమర్పించారు.అనంతరం అడ్వకేట్ కమిషన్ తో రామకృష్ణ మాట్లాడుతూ సీజ్ చేసిన వాహనాలను పార్కింగ్ చేస్తున్న రోడ్డు స్థానిక ప్రజలకు చాలా కాలంగా కనెక్టింగ్,అప్రోచ్ రోడ్డుగా ఉపయోగంలో ఉందని,ఈ రోడ్డు కమ్యూనిటీ హాల్‌తో పాటు ఇతర కమ్యూనిటీ సదుపాయాలకు వెళ్లేందుకు ప్రజలు వినియోగిస్తున్నారని ఆయన గుర్తు చేశారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ నగర్‌ను 1978 ప్రాంతంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం/హెచ్‌ఎండిఏ భూమి సేకరించి,ఆర్థికంగా బలహీన వర్గాలు,అర్హులైన లబ్ధిదారులకు నివాస సౌకర్యం కల్పించే ఉద్దేశంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రస్తుతం వాహనాల పార్కింగ్‌కు ఉపయోగిస్తున్న భూమి/రోడ్డుకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వు, అలాట్‌మెంట్ ఆర్డర్, శాంక్షన్డ్ ప్లాన్,డీమార్కేషన్ రికార్డు లేదా సంబంధిత అధికారుల అనుమతి ఏదైనా ఉందా అనే విషయాన్ని అధికారిక రికార్డుల ద్వారా పరిశీలించాలని కోరారు.2003--2005 ప్రాంతంలో సుమారు 19 మంది లబ్ధిదారులకు హౌసింగ్ పట్టాలు ఇచ్చినట్లు తనకు సమాచారం ఉందని, అయితే కమ్యూనిటీ హాల్, ఓపెన్/కమ్యూనిటీ స్పేస్ అవసరాల దృష్ట్యా ఆ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణ ప్రతిపాదన అమలు కాలేదని తెలిపారు.ఈ అంశాన్ని రెవెన్యూ/హెచ్‌ఎండిఏ రికార్డుల ద్వారా ధృవీకరించాలని సూచించారు.పోలీస్ శాఖకు కేటాయించిన భూమి ప్రత్యేకంగా గుర్తించదగినదిగా ఉండి, పోలీస్ మౌలిక సదుపాయాల కోసం కేటాయించినట్లు తనకు తెలిసినది తెలిపారు. అందువల్ల పోలీస్‌కు కేటాయించిన భూమి హద్దులు,విస్తీర్ణం,ప్రస్తుత వినియోగం,ప్రజలు ఉపయోగించే రోడ్డు/కమ్యూనిటీ స్థలం మధ్య తేడాను అధికారిక రికార్డులతో నిర్ధారించాలని కోరారు.స్థానిక ప్రజలను ఇబ్బందులు పెట్టొద్దని తెలిపారు.ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఉపయోగిస్తున్న రహదారి, కమ్యూనిటీ అవసరాలకు సంబంధించిన స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగించే ముందు, సంబంధిత అలాట్‌మెంట్, రెవెన్యూ, హెచ్‌ఎండిఏ, సర్వే, డీమార్కేషన్ రికార్డులను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాల్సిన అవసరం ఉందని ఆర్కే స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం

### - స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

### ఇమ్మడి శివలక్ష్మి జహంగీర్




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పంపిణీ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇమ్మడి శివలక్ష్మి జహంగీర్ అన్నారు.శనివారం జగదేవపూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంపల్లి కరుణాకర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇమ్మడి శివలక్ష్మి జహంగీర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలందరికీ రేషన్ కార్డులు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డులు అందక అనేక మంది అర్హులైన పేదలు ఇబ్బందులు పడ్డారని విమర్శించారు.గత ప్రభుత్వ హయాంలో రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేసిన దొడ్డు బియ్యాన్ని ప్రజలు పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోయారని, కొంతమంది ఆ బియ్యాన్ని తక్కువ ధరలకు విక్రయించేవారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పరిస్థితిని మార్చేందుకు తెల్ల రేషన్ కార్డుదారులకు ఉచితంగా నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేసే నిర్ణయం తీసుకుందని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తోందని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలను పేదలకు అందిస్తామని చెప్పారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీపై పూర్తి విశ్వాసంతో ఉన్నారని, వచ్చే ఎన్నికల్లోనూ ప్రజా ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.జగదేవపూర్ మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, నాయకులు దయానందరెడ్డి, గాలి రెడ్డి, అమర రాము, అజీమ్, వార్డు సభ్యులు ఆంజనేయులు, వెంకటేష్,

# హబ్సిగూడలో సైక్లింగ్ ట్రాక్ తొలగింపు

### ట్రాఫిక్ జామ్‌కు చెక్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ చొరవకు ఫలితం

### పలు ఫిర్యాదులు, పత్రికా కథనాల






తార్నాక (ప్రశ్న న్యూస్) మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం ప్రజలకు శాపంగా మారుతుంది. హబ్సిగూడ చౌరస్తాలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న సైక్లింగ్ ట్రాక్ ఎట్టకేలకు తొలగించారు. నిత్యం ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతున్న ఈ ట్రాక్‌ను తొలగించాలంటూ ట్రాఫిక్ పోలీసులు ఉప్పల్ సర్కిల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పలు పత్రికలో కథనాలు వచ్చిన ఇంతకాలం పట్టించుకోలేదన్న విమర్శలు తీవ్రంగా ఉన్నాయి. చివరకు నల్లకుంట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ప్రత్యేక చొరవతో శనివారం సైక్లింగ్ ట్రాక్‌ను తొలగించడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.హబ్సిగూడ చౌరస్తా నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఒకటి. ఉదయం, సాయంత్రం వేళల్లో భారీగా వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. ఇలాంటి కీలక ప్రాంతంలో రహదారి విస్తీర్ణాన్ని తగ్గించేలా ఏర్పాటు చేసిన సైక్లింగ్ ట్రాక్‌తో వాహనాలు వెళ్లేందుకు స్థలం సరిపోక తరచూ ట్రాఫిక్ స్తంభించేది. ట్రాఫిక్ పోలీసులు ఈ సమస్యను గుర్తించి ట్రాక్‌ను తొలగించాలని ఉప్పల్ సర్కిల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.అయితే ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించకపోవడంతో సమస్య కొనసాగుతూనే వచ్చింది. ట్రాఫిక్ ఇబ్బందులపై పలు పత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పటికీ ఉప్పల్ సర్కిల్ మున్సిపల్ అధికారులు చలనం చూపలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఉన్నత అధికారులు సైతం ఎందుకు స్పందించలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

#### పత్రికల్లో వచ్చినా.. పట్టించుకోరా.?

ఉప్పల్ సర్కిల్ పరిధిలో ఫుట్‌పాత్‌లు, రహదారుల నిర్వహణపై కూడా తరచూ విమర్శలు వస్తున్నాయి. ఫుట్ పాత్ ల ఆక్రమణలు, అస్తవ్యస్త నిర్వహణ, ప్రయాణికులకు ఇబ్బందులు వంటి అనేక సమస్యలు వెలుగులోకి వస్తున్నా మున్సిపల్ అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి. సమస్యలు పత్రికల్లో ప్రచురితమైన తర్వాత కూడా స్పందన కనిపించకపోవడం అధికారుల నిర్లక్ష్యపు పనితీరుపై అనుమానాలకు తావిస్తోంది. హబ్సిగూడలో సైక్లింగ్ ట్రాక్ తొలగింపు విషయంలో మాత్రం ట్రాఫిక్ పోలీసుల చొరవ ఫలించింది. నల్లకుంట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సమస్యను తీవ్రంగా పరిగణించి సంబంధిత అధికారులతో సమన్వయం చేయడంతో ఎట్టకేలకు ట్రాక్ తొలగింపు జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

#### మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి ఇకనైనా ముగింపు పలికేనా.?

ట్రాఫిక్ సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించాల్సిన ఉప్పల్ సర్కిల్ అధికారులు, డిప్యూటీ, జోనల్ కమిషనర్లు ఇకనైనా స్పందించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన ఫుట్‌పాత్‌లు, రహదారులు అస్తవ్యస్తంగా మారకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. ప్రజల సమస్యలు పత్రికల్లో వచ్చే వరకు వేచి చూసే నిర్లక్ష్యపు ధోరణికి అధికారులు స్వస్తి పలికి, క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా

# మళ్లా పెరుగుతున్న బంగారం ధరలు

**ముంబై :** బంగారం, వెండి ధరలు ఇంటర్నేషనల్ మార్కెట్లో మళ్లీ భారీగా పెరుగుతున్నాయి. దీంతో దేశీయంగా కూడా మళ్లీ గోల్డ్, సిల్వర్ రేట్లు ఎగబాకుతున్నాయి. గత 10 రోజుల వ్యవధిలో కేవలం ఒక్క రోజు మాత్రమే బంగారం ధర తగ్గింది. మిగతా అన్ని రోజులు భారీగా పెరుగుతూ పోయింది. ఈ క్రమంలో దాదాపు రూ. 6-7 వేల వరకు రేటు పెరిగిందని చెప్పొచ్చు. ఇంటర్నేషనల్ మార్కెట్లో ప్రస్తుతం స్పాట్ పసిడి రేటు ఔన్సుకు 4600 డాలర్ల మార్కు దాటి ట్రేడవుతోంది. సిల్వర్ ధర 69 డాలర్ల మార్కు వద్ద ఉంది. ఇక డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ ప్రస్తుతం రూ. 95.73 వద్ద కొనసాగుతోంది. దేశ రాజధాని దిల్లీలో ప్రస్తుతం 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 1,47,250 వద్ద ఉండగా, 24 క్యారెట్ల పుత్తడి ధర రూ. 1,60,630 వద్ద ఉంది. చెన్నై, ముంబై, బెంగళూరు, కోల్‌కతాల్లో 22 క్యారెట్లు, 24 క్యారెట్ల పసిడి ధర వరుసగా రూ. 147100, రూ. 160480 వద్ద ట్రేడవుతోంది.అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా దేశీయంగా కూడా గోల్డ్, సిల్వర్ రేట్లు పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఆగస్ట్ 22న ఉదయం 7.30 గంటల సమయంలో హైదరాబాద్ నగరంలో 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 1100 పెరిగి తులం రూ. 1,47,100 వద్ద ఉంది. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ. 1210 పెరగడంతో 10 గ్రాములకు రూ. 1,60,480 వద్ద ఉంది.మరోవైపు హైదరాబాద్ మార్కెట్‌లో సిల్వర్ రేటు ఆగస్ట్ 22న రూ. 5 వేలు పెరిగింది. దీంతో ప్రస్తుతం కేజీకి రూ. 2.65 లక్షల వద్ద ఉంది. ముందటి రోజు వెండి ధర ఏకంగా రూ. 10 వేలు పెరగ్గా, దానికి ముందు మాత్రం రూ. 5 వేలు పడిపోయింది. ఇక గత 2 రోజుల వ్యవధిలో చూస్తే సిల్వర్ రేటు రూ. 15 వేలు ఎగబాకింది.ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో కూడా గోల్డ్, సిల్వర్ రేట్లు పెరిగాయి. అమరావతి, విశాఖపట్నం, గుంటూరు, విజయవాడలో 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 147100 వద్ద ఉండగా, 24 క్యారెట్ల మేలిమి బంగారం ధర రూ. 160480 వద్ద ఉంది.ఇటీవల యూఎస్ డాలర్, బాండ్ ఈల్డ్స్ డిమాండ్ పెరగడంతో బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. ఇప్పుడు మాత్రం అవి వరుసగా గరిష్ఠ స్థాయిల నుంచి దిగొస్తుండగా, గ్లోబల్ మార్కెట్లో బంగారం, వెండి రేట్లు పుంజుకుంటున్నాయి. దీంతో ఇంటర్నేషనల్ మార్కెట్ ధరలకు అనుగుణంగానే దేశీయంగా కూడా రేట్లు పుంజుకుంటున్నాయి.భారతదేశంలో ఏయే అంశాలు బంగారం ధరల్ని ప్రభావితం చేస్తాయి నేరుగా అంతర్జాతీయ మార్కెట్ బంగారం ధరలు, దేశీయంగా నేరుగా ప్రభావం చూపిస్తాయి. అక్కడ పెరిగితే ఇక్కడా పెరుగుతాయి. అక్కడ తగ్గితే ఇక్కడా తగ్గుతాయి. ఇంకా ద్రవ్యోల్బణం, రూపాయి విలువ హెచ్చుతగ్గులు, ఫెడ్ వడ్డీ రేట్లు, ఇతర కేంద్ర బ్యాంకుల నిర్ణయాలు, ప్రభుత్వాలు విధించే సుంకాలు బంగారం, వెండి ధరల్ని ప్రభావితం చేస్తుంటాయి.

# మరో ఎంపీకి అమాత్య యోగం

**హైదరాబాద్** కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరుగుతుందన్న ప్రచారం నేపథ్యంలో తెలంగాణ నుంచి ఒకరికి అవకాశం వస్తుందన్న సమాచారంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఇటీవల చేపట్టిన బీజేపీ కేంద్ర కమిటీ విస్తరణలో తెలంగాణ నుంచి ఎవరికీ అవకాశం ఇవ్వకపోవడం, అదే సమయంలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు ప్రముఖ నేతలను జాతీయ కార్యకర్గం నుంచి తప్పించడంతో ఈ ప్రచారానికి ఊతమిస్తుందని చెబుతున్నారు. రాష్ట్రంలో బీజేపీకి 8 మంది ఎంపీలు ఉండగా, ఇప్పటికే ఇద్దరు మంత్రులుగా వ్యవహరిస్తున్నారు. పునర్వ్యస్థీకరణలో మరొకరికి చాన్స్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారని అంటున్నారు.మరో రెండేళ్లలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ హాట్ ఫేవరెట్ గా పోటీ ఇవ్వాలంటే రాష్ట్రంలో బీజేపీ నేతలు మరింత క్రియాశీలంగా పనిచేయాలని కేంద్ర పెద్దలు భావిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రతిపక్షాన్ని వెనక్కి నెట్టి ఆ స్థానంలో పోటీ ఇవ్వడమే కాకుండా, అధికారంలోకి రావాలంటే పార్టీని ఇంకా విస్తరించాలని బీజేపీ అగ్రనేతలు భావిస్తున్నారని చెబుతున్నారు. తమ లక్ష్యానికి చేరువ కావాలంటే పార్టీని పరిగెత్తించాలని, ఇందుకోసం నేతలకు కొత్త పదవులతో ప్రోత్సహించాలని అధిష్టానం ఆలోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో త్వరలో జరగబోయే కేంద్ర మంత్రి వర్గ విస్తరణలో తెలంగాణ నుంచి కచ్చితంగా ఒకరికి అవకాశం వస్తుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో 8 మంది ఎంపీలు ఉండగా, ఇప్పటికే ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్నారు. ఇంకా మిగిలిన ఆరుగురిలో ఒకరికి చాన్స్ ఇస్తారా? లేక బయట రాష్ట్రాల నుంచి పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్రానికే చెందిన ఎంపీలకు అవకాశం ఇస్తారా? అనేది హాట్ టాపిక్ అవుతోంది. ప్రస్తుతం రాష్ట్రానికి చెందిన ఇద్దరు బీజేపీ నేతలు బయట రాష్ట్రాల నుంచి రాజ్యసభ సభ్యులుగా పనిచేస్తున్నారు. వీరిలో సంఘ్ నేపథ్యం ఉన్న ఓబీసీ మోర్చా మాజీ అధ్యక్షుడు లక్ష్మణ్, బీసీ ఉద్యమ నాయకుడు ఆర్.కృష్ణయ్య ఉన్నారు. లక్ష్మణ్ ఉత్తరప్రదేశ్ నుంచి కృష్ణయ్య ఏపీ నుంచి రాజ్యసభ సభ్యులుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో రాష్ట్రానికి చెందిన 8 మందిలో ఎవరికి మంత్రి పదవి లభిస్తుందనేది విస్తృత చర్చగా ఉందని చెబుతున్నారు. ప్రధానంగా అనేక సమీకరణాలను పరిశీలిస్తున్న బీజేపీ అధిష్టానం బీసీ, మహిళ కోటాలో ఒకరికి అవకాశం ఇవ్వాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే ఇప్పటికే బీసీ కోటాలో కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ మంత్రిగా ఉండటంతో రాష్ట్రానికి చెందిన మహిళా నాయకురాలు డీకే అరుణ మంత్రి పదవి రేసులో ముందున్నట్లు ప్రచారం జరుగుతోంది. డీకే అరుణను మంత్రి వర్గంలోకి తీసుకోవాలనే ఆలోచనతోనే ఆమెను బీజేపీ జాతీయ ఉపాధ్యక్ష పదవి నుంచి తప్పించారని చెబుతున్నారు. కేంద్రం చెప్పిన కారణమేంటి? ప్రస్తుత సమీకరణాలను పరిశీలిస్తే కేంద్ర మంత్రివర్గంలో డీకే అరుణకు చోటిచ్చే పరిస్థితులే ఎక్కువగా కనిపిస్తున్నాయని అంటున్నారు. డీకే అరుణ సీనియార్టీ, సామాజిక నేపథ్యంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దీటుగా ఎదుర్కొనే సామర్థ్యం ఆమెకు అడ్వాంటేజ్ గా చెబుతున్నారు.

# 'పట్టు' జారి పోకుండా!

### - హైకమాండ్ ముందు రెండు ఆప్షన్లు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ హైకమాండ్ ముందు రెండు ఆప్షన్లున్నాయి. తెలంగాణ కాంగ్రెస్ లో క్రమశిక్షణ పట్టుతప్పుతోంది. నేతలే ప్రభుత్వాన్ని విమర్శలు చేయడంతో పార్టీ వచ్చే ఎన్నికల్లో తీవ్రంగా నష్టపోయే అవకాశముంది. ప్రస్తుతం కఠిన చర్యలు తీసుకోకుంటే పార్టీ మరింత గాడి తప్పే అవకాశముంది. చర్యలు తీసుకోకుంటే రానున్న కాలంలో మరింతగా నేతలు బయటపడతారు. అందుకే కాంగ్రెస్ నాయకత్వం తీవ్రంగా ఆలోచిస్తుంది. ఇప్పుడు రెండు ఆప్షన్లు ఉన్నట్లు కాంగ్రెస్ నాయకత్వం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన ముగించుకుని వచ్చిన తర్వాత ఆయన తో చర్చించిన తర్వాత ఈ చర్యలకు దిగే అవకాశముంది. చర్యలు తీసుకోకుంటే చేతకాని తనంగా భావిస్తారు. భవిష్యత్ లో పార్టీ నేతలు మరింత కట్టు తప్పే అవకాశాలున్నాయి.

#### - ఆప్షన్ 1 : మంత్రి వర్గం ప్రక్షాళన

కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి ప్రస్తుతం బెస్ట్ ఆప్షన్ మంత్రి వర్గం ప్రక్షాళన అని భావిస్తుంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయి రెండున్నరేళ్లు దాటి పోతుండటంతో ఖచ్చితంగా మంత్రివర్గ ప్రక్షాళ చేస్తూ కట్టుబాటు తప్పిన నేతలను పదవుల నుంచి తప్పిస్తే కొంత సాఫీగా సాగిపోతుంది. తప్పించిన మంత్రి స్థానంలో అదే సామాజికవర్గానికి చెందిన మరొకరికి అవకాశం కల్పిస్తే కులం కార్డు కూడా వాడే అవకాశం లేదు. మంత్రుల పనితీరు, మరొకరికి అవకాశం కల్పించాలన్న ఉద్దేశ్యంతో మంత్రి వర్గం ప్రక్షాళన చేయవచ్చు. ఆ జిల్లాలో కానీ, మరొకచోట కాని ప్రత్యామ్నాయ నేతకు మంత్రి పదవి ఇవ్వొచ్చు. కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తొలగించడం కంటే మరికొందరితో పాటు ఆమెను కూడా తప్పించి మరొక బీసీ సామాజికవర్గానికి ఇస్తే ఏ గొడవ ఉండదని భావిస్తుంది.

#### - ఆప్షన్ 2 : ఇద్దరినీ తప్పించడం ఒక ఆప్షన్

కాంగ్రెస్ నాయకత్వం ముందున్న మరొక ఆప్షన్ ఇద్దరు నేతలను పార్టీ నుంచి తప్పించడం. మంత్రి పదవి నుంచి తప్పించి మరొకరికి అవకాశం ఇవ్వొచ్చు. అలాగే మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన సీనియర్ నేత చిన్నారెడ్డిపై కూడా వేటు వేయవచ్చు. అప్పుడు కూడా సామాజిక కార్డు వాడుకునే అవకాశం ఉండదని ఆలోచన ఉంది.

అయితే కొండా సురేఖ ప్రస్తుతం మంత్రి వర్గంలో ఉన్నారు. చిన్నారెడ్డి ప్రణాళిక సంఘం వైస్ ఛైర్మన్ గా ఉన్నారు. ఇద్దరినీ పదవి నుంచి తప్పిస్తే ఇటు బీసీ, అటు రెడ్డి సామాజికవర్గం నేతలపై చర్యలు తీసుకున్నట్లుంటుందన్న భావన కూడా ఉంది. చిన్నారెడ్డి పై చ్యలు తీసుకున్నా పెద్దగా రియాక్ట్ కాకపోవచ్చు. కానీ కొండా సురేఖను తప్పిస్తే మరింతగా ఆ కుటుంబం ఎదురుదాడి చేసే అవకాశాలున్నాయి. వాటిని ఎదుర్కొనడంపైన కూడా ఆలోచించి ముందడుగు వేయాల్సి ఉంటుందన్న అభిప్రాయం సీనియర్ నేతలలో ఉంది. మొత్తం మీద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్ పర్యటన నుంచి వచ్చిన తర్వాత మాత్రమే దీనిపై క్లారిటీ రానుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## లేబర్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ

# లేబర్లు లేబర్ కార్డు పొంది ఉండాలి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) సిఐటియు అనుబంధ యూనియన్ బీసీ డబ్ల్యూ యూనియన్ ఆధ్వర్యంలో అడ్డ మీద పనిచేస్తున్న లేబర్లకు లేబర్ కార్డుల కోసం అప్లై చేశారు. లేబర్ కార్డులను అందరూ తీసుకోవాలని సీఐటీయూ మేడ్చల్ మండల కమిటీ భవన నిర్మాణ కార్మికులకు విజ్ఞప్తి చేస్తుంది. ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్ మండల కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ లేబర్ కార్డు అనేది భవన నిర్మాణంలో పనిచేస్తున్న ప్రతి ఒక్క కార్మికుడు తప్పనిసరిగా ఉండాలన్నారు., ఈ లేబర్ కార్డుల వల్ల కార్మికునికి ఏదైనా ప్రమాదం జరిగిన, లేక ప్రమాదవశాస్తూ మరణించిన వ్యక్తికీ 10లక్షలు లేబర్ డిపార్ట్మెంట్ నుంచి ఆర్థిక సహాయం అందుతుందని తెలియజేశారు. సహజ మరణానికి 2లక్షలు, కార్డు తీసుకున్న కార్మికుని కూతురు పెళ్లికి 30వేల ఆర్థిక సహాయము, మరియు వాళ్ళ పిల్లలు డెలివరీ అయినప్పుడు ఆర్థిక సహాయము 30వేలు ఈ కార్డు తీసుకున్న ప్రతి ఒక్కరికి వర్తిస్తుందని, అంగ వైఖల్యం చెందితే 50వేల రూపాయలు వస్తాయి, కాబట్టి ప్రతి కార్మికుడు లేబర్ కార్డు తప్పనిసరిగా తీసుకోవాలని భవన నిర్మాణంలో పని చేసే ప్రతి కార్మికునికి సిఐటియు విజ్ఞప్తి చేస్తుందని అన్నారు. మరింత సమాచారం కోసం ఈ క్రింది ఫోన్ నెంబర్ లకు సంప్రదించాలని వివరించారు 9951408268, 7569266582, 7993929594. ఈ కార్యక్రమంలో బి సి డబ్ల్యూ యూనియన్ జిల్లా నాయకులు అశోక్, మండల నాయకులు ఎన్ కృష్ణ, జి శ్రీను, స్వామి, సీ హెచ్ . కృష్ణ, ఎల్లం, ఎల్లయ్య, అస్తరమ్మా, రజిని, సుతారి గూడా శ్రీను, అనిత తదితరులు పాల్గొన్నారు.

# మామూళ్ల మత్తులో టౌన్ ప్లానింగ్.?

**-కీర్తి రెసిడెన్సీ ఆరో అంతస్తు నిర్మాణంపై ఫిర్యాదుల వెల్లువ**

**- ఐదేళ్లుగా పీజీఆర్ఎస్ చుట్టూ తిరుగుతున్న అపార్ట్మెంట్ వాసులు**

**-కమిషనర్ నుంచి చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ వరకు ఫిర్యాదులు**

**- నోటీసులు, విచారణల పేరుతో కాలయాపన చేస్తున్నారంటూ ఆరోపణలు**



గుంటూరు(ప్రశ్న న్యూస్) ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఐదేళ్లుగా ఫిర్యాదులు. అధికారుల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు. పీజీఆర్ఎస్‌లో అర్జీలు. మున్సిపల్ అధికారులకు వినతులు. చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌ను కలిసి విన్నపాలు. జీఎంసీ కమిషనర్ దృష్టికి సమస్య. చివరకు జిల్లా కలెక్టర్ నిర్వహించే పీజీఆర్ఎస్‌లోనూ ఫిర్యాదు. అయినా సమస్యకు మాత్రం పరిష్కారం కనిపించడం లేదని గుంటూరు నగరంలోని విఘ్నేశ్వర కాలనీ, ఇన్నర్ రింగ్ రోడ్డు పరిధిలోని కీర్తి రెసిడెన్సీ అపార్ట్మెంట్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అపార్ట్మెంట్ భవనంలో ఆరో అంతస్తు నిర్మాణానికి సంబంధించిన అంశంపై తాము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు చేసిన ప్రతిసారీ 'చూద్దాం', 'చేస్తాం', 'నోటీసు ఇస్తాం' అంటూ సమయం తీసుకుంటున్నారని, రోజులు వారాలుగా.. వారాలు నెలలుగా మారుతున్నా తుది పరిష్కారం మాత్రం కనిపించడం లేదని వాపోతున్నారు.

**"మా సమస్యను ఎవరు పరిష్కరిస్తారు?" అంటూ అధికారుల తీరుపై వారు ప్రశ్నిస్తున్నారు.**

### ఐదేళ్లుగా ఇదే కథ..

కీర్తి రెసిడెన్సీ అపార్ట్మెంట్ వాసుల వాదన ప్రకారం.. భవనంలోని ఆరో అంతస్తు నిర్మాణానికి సంబంధించి గత ఐదేళ్లుగా పలు దశల్లో అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. జీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగానికి వినతులు అందజేయడంతో పాటు పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)లోనూ పలుమార్లు అర్జీలు సమర్పించినట్లు చెబుతున్నారు.

అయితే ఫిర్యాదులపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకుండా తమను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులను కలవడానికి వెళ్లిన ప్రతిసారీ కొత్త తేదీ చెప్పడం.. ఆ తేదీకి వెళ్లినప్పుడు మరో కారణం చెప్పడం పరిపాటిగా మారిందని అంటున్నారు.

### ఫిర్యాదు కాగితానికి విలువ లేదా?

"ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బుతో ఇళ్లు నిర్మించుకుంటారు. భవన నిర్మాణానికి సంబంధించిన నిబంధనలు అమలవుతున్నాయా? అనుమతులకు అనుగుణంగానే నిర్మాణం జరుగుతోందా? అనే అంశాలను పరిశీలించాల్సిన బాధ్యత అధికారులది. కానీ మేము ఇచ్చిన ఫిర్యాదులను కనీసం పట్టించుకుంటున్నారా?" అని అపార్ట్మెంట్ వాసులు ప్రశ్నిస్తున్నారు.

తాము ఇచ్చిన ఫిర్యాదు కాగితాన్ని సంబంధిత విభాగం అధికారులు చిత్తుకాగితంలా చూస్తున్నారన్న భావన కలుగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై స్పష్టమైన సమాచారం ఇవ్వకుండా, విచారణ పూర్తయిందా? ఏం తేలింది? నిబంధనలకు అనుగుణంగా ఉందా? ఉల్లంఘన ఉంటే ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే విషయాలను వెల్లడించడం లేదని అంటున్నారు.

### ఇకనైనా ఉన్నతాధికారులు స్పందిస్తారా.?

గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు నుంచి గోరంట్ల మీదుగా ఆటోనగర్ వైపు వెళ్లే మార్గంలోని విఘ్నేశ్వర కాలనీలో ఉన్న కీర్తి రెసిడెన్సీ వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఐదేళ్లుగా ఫిర్యాదులు చేస్తున్నామని చెబుతున్న అపార్ట్మెంట్ వాసుల సమస్యపై జీఎంసీ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా.. జీఎంసీకి వెళ్లినా.. కమిషనర్‌ను కలిసినా.. చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌ను కలిసినా పరిష్కారం లేకపోతే ఇక సామాన్యుడు ఎక్కడికి వెళ్లాలి?ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు 'రేపు.. ఎల్లుండి' అంటూ కాలయాపన చేయకుండా, ఫిర్యాదుపై వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని అపార్ట్మెంట్ వాసులు కోరుతున్నారు.కీర్తి రెసిడెన్సీ ఆరో అంతస్తు నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, ప్లాన్, నిర్మాణ స్థితి, గతంలో వచ్చిన ఫిర్యాదులు, వాటిపై తీసుకున్న చర్యలు అన్నింటినీ సమగ్రంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ప్రజల ఆరోపణల్లో వాస్తవం ఎంత? అధికారుల నిర్లక్ష్యం ఎంత? నిర్మాణానికి సంబంధించిన నిబంధనలు ఏమి చెబుతున్నాయి? ఫిర్యాదులపై ఎందుకు నిర్ణయం తీసుకోలేకపోయారు? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది.ఐదేళ్లుగా సాగుతున్న ఈ 'వాయిదాల పర్వానికి' ఇకనైనా తెరపడుతుందా? కీర్తి రెసిడెన్సీ వాసుల ఫిర్యాదుకు జీఎంసీ అధికారులు శాశ్వత పరిష్కారం చూపుతారా? అన్నది వేచి చూడాలి.

# పాత, విరిగిన దేవతా పటాలు, విగ్రహాలకు శాస్త్రోక్త పరిష్కారం

**పాత లేదా విరిగిన దేవతా పటాలు, విగ్రహాలను బయట పడేయకుండా గౌరవప్రదంగా ఉద్వాసన.**

**శాస్త్రోక్త పూజల అనంతరం స్వచ్ఛంద సేవకుల ద్వారా దివ్య వ్యర్థాల నిర్వహణ.**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )పర్యావరణ పరిరక్షణతో పాటు భారతీయ సాంప్రదాయాలను కాపాడే లక్ష్యంతో మేడ్చల్ సర్కిల్ గుండ్ల పోచంపల్లి లో ప్రాజెక్ట్ ఉద్వాసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మేడ్చల్ డిప్యూటీ కమిషనర్ సుదాంష్ తెలిపారు.ఇళ్లలో పూజించిన అనంతరం పాతబడిన లేదా విరిగిపోయిన దేవతా పటాలు, విగ్రహాలను చెత్తలో లేదా బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా, వాటిని గౌరవప్రదంగా శాస్త్రోక్త విధానంలో ఉద్వాసన చేసే అవకాశాన్ని ఈ కార్యక్రమం కల్పిస్తుందని డిప్యూటీ కమిషనర్ సుదాంష్ పేర్కొన్నారు. ప్రజలు తమ ఇళ్లలో ఉన్న పాత లేదా విరిగిన దేవతా పటాలు, విగ్రహాలను తమకు అందజేయవచ్చని తెలిపారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం, శిక్షణ పొందిన వాలంటీర్ల ద్వారా సంప్రదాయబద్ధంగా ఉద్వాసన నిర్వహించబడుతుందని వివరించారు ఇందులో భాగంగా గుండ్ల పోచంపల్లి లోని శివాలయం లో గౌరవప్రదంగా శాస్త్రోక్త విధానంలో ఉద్వాసన కార్యక్రమాన్ని చేపట్టారు.ప్రజలు తమకు సమీపంలోని దేవాలయాల్లో పాత లేదా విరిగిన దేవతా పటాలు, విగ్రహాలను అందజేసి ఈ పర్యావరణహిత, శాస్త్రోక్త కార్యక్రమంలో భాగస్వాములు కావాలని డిప్యూటీఎకమిషనర్ కోరారు.ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై, ధార్మిక విశ్వాసాలను గౌరవిస్తూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుదాంష్ పిలుపు నిచ్చారు.

# నిరుద్యోగులకు మొండి చేయి...

# మీసేవలకే ఆధార్ కేంద్రాలు.

**ఈ డీ యం నిర్లక్ష్యంతో ఆధార్ కేంద్రాల కేటాయింపులో అన్యాయం**

**ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తున్న అధికార యంత్రాంగం.**

**పారదర్శకత లేని కేటాయింపులు...**

**ప్రశ్నిస్తున్న నిరుద్యోగులు.**

**నిరుద్యోగులకు అందని ఆధార్ కేంద్రాలు.**

**మీసేవ నిర్వాహకులకే మళ్లీ పండగ.**




ములుగు (ప్రశ్న న్యూస్)ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పూర్తి విరుద్ధంగా జరుగుతోంది. ఆధార్ కేంద్రాల కేటాయింపులో జిల్లా యంత్రాంగం నిరుద్యోగులను పక్కనపెట్టి, ఇప్పటికే మీసేవ కేంద్రాలు నడుపుతున్న వారికే మళ్లీ అవకాశాలు కట్టబెడుతోందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.ఈ డీ యం కార్యాలయం నుంచి జరుగుతున్న ఈ కేటాయింపుల్లో పారదర్శకత పూర్తిగా మాయమైందని, అర్హులైన సాధారణ నిరుద్యోగుల దరఖాస్తులు పక్కనపడుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఒకరికే అన్నీ... మిగిలిన వారికి శూన్యం.

ఇప్పటికే మీసేవ ద్వారా నెలకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఆదాయం పొందుతున్న నిర్వాహకులకు ఆధార్ కేంద్రాల బాధ్యతలు కూడా అప్పగించడం వల్ల కొత్తగా ఉపాధి కోసం ఎదురుచూస్తున్న యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. మేము డిగ్రీలు, పీజీ లు చేసి సంవత్సరాల తరబడి నిరుద్యోగులుగా ఉన్నాం. ఆధార్ కేంద్రం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా సమాధానం లేదు. కానీ మీసేవ నడుపుతున్న వారికి మాత్రం ఫోన్ చేసి అవకాశం ఇస్తున్నారు" అని ఓ నిరుద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు.ఈ డీ యం కార్యాలయం నుంచి జారీ చేసే అనుమతులు, సిఫార్సుల్లో ఏ ప్రాతిపదిక తీసుకుంటున్నారో తెలియడం లేదు. దరఖాస్తుల పరిశీలన పేరుతో జాప్యం చేసి, చివరికి వత్తాసు ఉన్న వారికే కేటాయిస్తున్నారనే చర్చ జోరుగా సాగుతోంది.

### ఆదాయం రెట్టింపు, అవకాశాలు సున్నా.

ఆధార్ అప్‌డేట్‌కు ఒక్కో కార్డుకు రూ.50 వరకు ఫీజు వస్తుంది. రోజుకు 50–100 మంది వస్తే నెలకు రూ.75 వేల వరకు ఆదాయం. ఇప్పటికే మీసేవ ఆదాయం ఉన్న వారికి ఇది కూడా కలిపితే వారి ఆదాయం లక్ష దాటుతుంది. కానీ కొత్తగా వ్యాపారం మొదలుపెట్టాలనుకునే నిరుద్యోగికి మాత్రం బ్యాంకు లోన్ కోసం తిరిగినా, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేదు. ఉపాధి కల్పిస్తామన్న ప్రభుత్వం. ఈ డీ యం గారు మమ్మల్ని పట్టించుకోవడం లేదు" అని నిరుద్యోగ సంఘాల నేతలు మండిపడుతున్నారు.

### ఈ డీ యం కార్యాలయంపై ప్రధాన ఆరోపణలు.

పారదర్శకత లేకపోవడం: కేటాయింపులకు ఎలాంటి బహిరంగ ప్రకటన, మెరిట్ లిస్ట్ విడుదల చేయడం లేదు.

ఏకపక్ష నిర్ణయాలు: దరఖాస్తు చేసుకున్న అందరికీ అవకాశం ఇవ్వకుండా, ఇప్పటికే ఉన్న మీసేవలకే ప్రాధాన్యత.

నిరుద్యోగుల విజ్ఞప్తుల నిర్లక్ష్యం: కలెక్టరేట్‌లో వినతులు ఇచ్చినా పట్టించుకున్న పాపాన పోలేదు.

### ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలి.

ఆధార్ కేంద్రాల కేటాయింపులో అవకతవకలు జరుగుతున్నాయని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి, జిల్లాలోని ఆధార్ కేంద్రాల కేటాయింపులపై సమగ్ర విచారణ జరిపి, అర్హత కలిగిన ప్రతి నిరుద్యోగికి సమాన అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు నిరుద్యోగుల కోసమే. కానీ ఈ డీ యం గారి పర్యవేక్షణలో అవి కూడా కొద్దిమంది చేతుల్లోకి వెళ్తున్నాయి. దీనిపై సీఎం, మంత్రులు వెంటనే చర్యలు తీసుకోవాలి" అని వారు కోరుతున్నారు. ఆధార్ కేంద్రాల విషయంలో నెలకొన్న ఈ అసమానతలపై ఈ డీ యం ఏం సమాధానం ఇస్తారో వేచి చూడాలి.

# సద్భావనా దివస్ సందర్భంగా సద్భావనా ప్రతిజ్ఞ



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, గజ్వేల్‌లో సద్భావనా దివస్ సందర్భంగా జాతీయ సేవా పథకం ( ఎన్ ఎస్ ఎస్ ) ఆధ్వర్యంలో సద్భావనా ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చీూా ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. పి. సౌజన్య, డా. కె. సరోజ సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనితా అబ్రహాం మాట్లాడుతూ సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావం, జాతీయ ఐక్యతను పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు.వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి కమల క్రిస్టియానా, అకడమిక్ కోఆర్డినేటర్ డా. జె. ఉమారాణి, ఐ క్యూ ఏ సి,కోఆర్డినేటర్ శ్రీమతి ఎం.ఎం. లక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ డా. రాజారావు, తెలుగు అధ్యాపకులు డా. చంద్రశేఖర్‌తో పాటు అధ్యాపకులు డా. శోభారాణి, శ్రీలత, అర్చన, ఉమారాణి, శృతి, కస్తూరిబాయి, రమణారెడ్డి, అనురాధ, అన్వర్, దీపిక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి సద్భావనా ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా మత, భాష, ప్రాంతీయ భేదాలకు అతీతంగా పరస్పర గౌరవం, శాంతి, సామరస్యంతో మెలుగుతామని, దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.విద్యార్థుల్లో, సమాజంలో సద్భావన, ఐక్యత, దేశభక్తి భావాలను పెంపొందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు తెలిపారు.

# బీఆర్ఎస్ నుంచి తెలంగాణ రక్షణ సేనలోకి పలువురు నాయకుల చేరిక

**నియోజకవర్గ ఇంచార్జ్ కొట్టాల యాదగిరి**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ కొట్టాల యాదగిరి ఆధ్వర్యంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలువురు బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీలో చేరారు. మున్సిపాలిటీలోని 8వ, 9వ, 12వ వార్డులతో పాటు ఏటిగడ్డ కిష్టాపూర్ ఆర్అండ్ఆర్ కాలనీ ప్రాంతానికి చెందిన పలువురు నాయకులు తెలంగాణ రక్షణ సేనలో చేరారు. ఏటిగడ్డ కిష్టాపూర్ ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన లింగని రాజు, పెద్దమాతరి కనకరాజు, పల్లెపాడు 8వ వార్డుకు చెందిన మణుగూరు గణేష్ తదితరులు పార్టీలో చేరారు. వారికి కొట్టాల యాదగిరి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా కొట్టాల యాదగిరి మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండే రాజకీయ వేదికగా పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే తెలంగాణ రక్షణ సేన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.రాబోయే రోజుల్లో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలోని ప్రతి వార్డు, ప్రతి గ్రామంలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎడ్ల నర్సింలు, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పట్టణ యువజన నాయకులు కూరాకుల శ్రీకాంత్, 7వ వార్డు అధ్యక్షులు కుమార్, నరేందర్ రెడ్డి, అశోక్, కనకసేన, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఖాజా విరాహత్ అలీకి హరీశ్ రావు పరామర్శ

**కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన మాజీ మంత్రి**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) ప్రముఖ జర్నలిస్ట్ విరాహత్ అలీని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తన్నీరు హరీశ్ రావు పరామర్శించారు. ఇటీవల విరాహత్ అలీ కుటుంబంలో చోటుచేసుకున్న విషాద ఘటన నేపథ్యంలో ఆయనను కలిసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా హరీశ్ రావు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కోరారు.

విరాహత్ అలీకి, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి, వంటేరు ప్రతాపరెడ్డి, బక్కి వెంకటయ్య, ఎర్రోళ్ల శ్రీనివాస్, రాజనర్సు, గంగిశెట్టి రవి, బెండే మధు, నూనె కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు జీవనోపాధి దిశగా పి-4

## పేద కుటుంబాలకు అండగా నిలవడమే లక్ష్యం.. బొండా రవితేజ



విజయవాడ(ప్రశ్న న్యూస్ ) మహిళలు ఇతరులపై ఆధారపడకుండా తమ కాళ్లపై తాము నిలబడేలా జీవనోపాధి అవకాశాలు కల్పించడమే పి-4 కార్యక్రమం లక్ష్యమని తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు బొండా రవితేజ తెలిపారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో పేద కుటుంబాలను గుర్తించి వారికి అండగా నిలుస్తున్నామని చెప్పారు. సింగ్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద శనివారం 31వ డివిజన్ శ్రీనగర్ కాలనీకి చెందిన కనుపర్తి శేషమ్మకు జీరో పావర్టీ--పి-4 కార్యక్రమం ద్వారా రూ.13 వేల విలువైన కుట్టుమిషన్‌ను బొండా రవితేజ అందజేశారు. ప్రజాదర్బార్‌లో శేషమ్మ ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావును కలిసి కుట్టుమిషన్ అందజేస్తే కుట్టుపని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకోగలనని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని బొండా రవితేజ దృష్టికి తీసుకెళ్లారు. పి-4 కార్యక్రమం ద్వారా కుట్టుమిషన్ అందించాలని సూచించడంతో రవితేజ వెంటనే స్పందించి శేషమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా బొండా రవితేజ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నిజంగా అవసరమైన పేద కుటుంబాలను గుర్తించి వారికి అండగా నిలవడమే పి-4 కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, బొండా సిద్ధార్థ, తాను కలిసి విద్య, వైద్యం, ఆర్థిక సహాయం వంటి అవసరాల్లో ప్రజలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్, 31వ డివిజన్ అధ్యక్షుడు గద్దం శ్రీనివాసరావు, దేవరపు మాల్యాద్రి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి ఉదయశ్రీ, దొండపాటి సుల్తానా, కంచేటి నాగరాజు, దేవర సత్యనారాయణ, లబ్బా వైకుంఠం, ఎస్‌కే పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

# పీలేరు ఏపీడబ్ల్యూజేఎఫ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

## గౌరవాధ్యక్షుడిగా నంద్యాల నాగరాజు..

## అధ్యక్షుడిగా మేడసాని రవి నాయుడు



పీలేరు (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీబీజేఏ) పీలేరు నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీలేరు పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో జరిగిన మీడియా మిత్రుల సమావేశంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల సమక్షంలో ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల ఏకాభిప్రాయంతో 'వార్త' దినపత్రిక ఇన్‌ఛార్జి నంద్యాల నాగరాజును గౌరవాధ్యక్షుడిగా, మేడసాని రవి నాయుడును అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా రామిశెట్టి మనోహర, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పుట్టా శ్రీనాథ్, కోశాధికారిగా వి. తులసి కృష్ణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా తిరుమలయ్య, ఆఫీజుల్లా, చిన్న మునిరెడ్డి, కార్యదర్శులుగా ఈశ్వర్ గౌడ్, రఘునాథ్, సంయుక్త కార్యదర్శులుగా శివకుమార్, దుబ్బా రామ్మోహన్, నయీమ్ భాష ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా ఎన్నికైన నంద్యాల నాగరాజు మాట్లాడుతూ.. తనపై విశ్వాసంతో బాధ్యతలు అప్పగించిన మీడియా మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. పీలేరు నియోజకవర్గంలో పాత్రికేయుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ అందరినీ కలుపుకుని ముందుకు సాగుతానని తెలిపారు. నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నికతో పీలేరు నియోజకవర్గంలో పత్రికా రంగానికి కొత్త ఉత్సాహం వచ్చిందని పలువురు జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు.

# వెలిగొండ కల సాకారం.. 31న నీటి విడుదల

## 48 రోజుల్లో నిర్వాసితులకు రూ.768 కోట్లు




అమరావతి(ప్రశ్న న్యూస్) మూడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సాకారం కానుంది. ఈ నెల 31న ప్రాజెక్టు తొలిదశను ప్రారంభించి నీటిని విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. వెలిగొండ నిర్వాసితులకు మూడో విడతగా రూ.250 కోట్ల పరిహారం చెక్కును శుక్రవారం సీఎం అందజేశారు. దీంతో ఇప్పటివరకు 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల పరిహారం చెల్లించినట్లయింది. నిర్వాసితులతో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఆయా జిల్లాల ప్రజలు ఎదురుచూస్తున్న కలను సాకారం చేస్తున్నామని అన్నారు. 1995లో తాను ఆ ప్రాంతానికి వెళ్లినప్పుడు రైతులు సాగు, తాగునీరు కోరారని, 1996లో ప్రాజెక్టుకు రూపకల్పన చేసి శంకుస్థాపన చేశానని గుర్తుచేశారు. ఇప్పుడు 2026లో అదే ప్రాజెక్టును ప్రారంభిస్తున్నానని చెప్పారు. వెలిగొండ తొలిదశను పూర్తి చేసి ప్రారంభించేలా రెండేళ్లలో రూ.2,250 కోట్లు ఖర్చు చేసినట్లు సీఎం తెలిపారు. గతంలోనే ప్రాజెక్టు పూర్తవ్వాల్సి ఉన్నా ఆలస్యం జరిగిందన్నారు. ఇబ్బందులు ఉన్నప్పటికీ వెలిగొండను పూర్తి చేసి నీరు అందించాలని సంకల్పించామని పేర్కొన్నారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఉందని, శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు ఆశించిన స్థాయిలో నీరు రాలేదని తెలిపారు. నీటిని పొదుపుగా వినియోగించాల్సిన పరిస్థితి ఉందన్నారు. పోలవరం పూర్తిచేసి కృష్ణాడెల్టాకు, శ్రీశైలంలో నీటిని పొదుపు చేసి ప్రకాశం, నెల్లూరు, కడప, రాయలసీమ ప్రాంతాలకు నీరు అందించవచ్చని చెప్పారు. గంగా-గోదావరి-కావేరి అనుసంధానంపై సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించినట్లు చంద్రబాబు తెలిపారు. ఐదు నదులను అనుసంధానిస్తే నాలుగు రాష్ట్రాల నీటి సమస్యలు పరిష్కారమై దేశానికి నీటి భద్రత ఏర్పడుతుందని పేర్కొన్నారు. మార్కాపురం జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి నీరు అందిస్తామని సీఎం తెలిపారు. సెప్టెంబరులో హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన చేస్తామని చెప్పారు. రామాయపట్నం పోర్టు ద్వారా రైతులు ఉద్యాన ఉత్పత్తులను ఎగుమతి చేసుకునే అవకాశాలు ఏర్పడతాయని వివరించారుఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సూపర్ సిక్స్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, అభివృద్ధితోపాటు ప్రాజెక్టులను కూడా పూర్తి చేయాల్సిన బాధ్యత ఉందని సీఎం అన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అందించిన పరిహారంపై వెలిగొండ నిర్వాసితులు సంతృప్తి వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పరిహారం విషయంలో తమను ఇబ్బందులకు గురిచేసిందని రైతు కాశిరెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం పరిహారం అందించడంతో సంతోషంగా ఉందన్నారు. తమ కలగా భావించిన ప్రాజెక్టు కళ్ల ముందే సాకారం కావడం ఆనందంగా ఉందని నిర్వాసిత రైతు బోగెం శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ ప్రశాంతి, వెలిగొండ నిర్వాసితులు పాల్గొన్నారు.

# అడవుల పునరుద్ధరణకు సీడ్ బాల్స్

## 20,929 హెక్టార్లలో 2.06 కోట్ల విత్తన బంతుల విస్తరణ

## 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యంలో కీలక ముందడుగు





అమరావతి(ప్రశ్న న్యూస్ ) రాష్ట్రంలో అడవుల పునరుద్ధరణ, పచ్చదనం పెంపొందించే దిశగా సీడ్ బాల్స్ విస్తరణ కార్యక్రమం జోరుగా సాగుతోంది. ఉప ముఖ్యమంత్రి, అటవీ--పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ నిర్దేశించిన 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యం సాధించే దిశగా అటవీశాఖ వడివడిగా అడుగులు వేస్తోంది. ఇప్పటి వరకు 20,929 హెక్టార్లలో 2.06 కోట్ల సీడ్ బాల్స్‌ను వెదజల్లినట్లు అటవీశాఖ వెల్లడించింది. క్షీణించిన అటవీ ప్రాంతాలను పునరుద్ధరించడంతోపాటు పచ్చదనం పెంచే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం నిర్దేశిత లక్ష్యంలో సుమారు 85 శాతం పూర్తయింది. అటవీశాఖ స్థానిక సమాజాలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ శాఖల సమన్వయంతో సీడ్ బాల్స్ తయారీ, విస్తరణ ప్రక్రియను కొనసాగిస్తోంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మూలపాడు ఎకో పార్క్‌లో తొలి విత్తన బంతిని తయారు చేయడం ద్వారా పవన్ కళ్యాణ్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అధికారులు, ప్రజల్లో ఆయన నింపిన స్ఫూర్తితో 2.82 కోట్ల సీడ్ బాల్స్ తయారీకి బీజం పడింది. ఈ సీజన్‌లో 3 కోట్లకు పైగా సీడ్ బాల్స్‌ను వెదజల్లాలనే లక్ష్యంతో అటవీశాఖ ముందుకు సాగుతోంది. తిరుపతి, అనంతపురం, కర్నూలు, గుంటూరు, రాజమహేంద్రవరం, ఎన్టీఆర్, విశాఖపట్నం జిల్లాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టారు. అటవీ అంచుల్లో క్షేత్రస్థాయి సిబ్బందితో పాటు సరిహద్దు గ్రామాల ప్రజలు కూడా భాగస్వాములై కార్యక్రమాన్ని ఉద్యమంలా కొనసాగించారు. సీడ్ బాల్స్ తయారీ, రవాణా, విస్తరణలో అటవీశాఖ క్షేత్రస్థాయి సిబ్బంది చురుగ్గా పాల్గొంటున్నారు. సీడ్ బాల్స్ విస్తరణ ప్రక్రియలో భాగస్వాములైన అటవీశాఖ సిబ్బందితో పాటు ప్రతి ఒక్కరినీ పవన్ కళ్యాణ్ అభినందించారు. సీడ్ బాల్స్ వెదజల్లడమే కాకుండా, వాటి ద్వారా వచ్చే ఫలితాలపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. విత్తనాలు మొలకెత్తే శాతం, మొక్కల ఎదుగుదల, ఆయా ప్రాంతాల్లో పచ్చదనం పెరుగుతున్న తీరును నిరంతరం పర్యవేక్షించాలని అటవీశాఖకు సూచించారు. 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్య సాధనలో సీడ్ బాల్స్ కార్యక్రమాన్ని కీలక సాధనంగా మలచాలని స్పష్టం చేశారు.

# కొళాయిలు ఇచ్చారు.. నీళ్లు మరిచారు

**- తాడికొండ జగన్ కాలనీలో దుర్భర పరిస్థితులు - రోడ్లు లేవు, కాలువలు లేవు, వర్షం వస్తే మోకాళ్ల లోతు నీరు**

**-తుమ్మ చెట్లు, గడ్డి మధ్య ఇళ్లకు రాకపోకలు -రాత్రివేళ చీకట్లు,ఇళ్ల మధ్యే విషసర్పాల సంచారం**

**-అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోరు -ఎమ్మెల్యే, ఎండీఓ, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా చర్యలు శూన్యం**



తాడికొండ(ప్రశ్న న్యూస్ ) సొంతింటి కల నెరవేరిందన్న ఆనందం.. కానీ ఆ ఇంటికి వెళ్లేందుకు రోడ్డు లేదు. ఇంటి ముందు కాలువ లేదు. వర్షం పడితే బయటకు రావడానికి దారి లేదు. పచ్చగా పెరిగిన గడ్డి, తుమ్మ చెట్ల మధ్య ఇళ్లు.. చుట్టూ పొలాలు.. అడుగడుగునా పాముల భయం.. రాత్రివేళ సరిగా విద్యుత్ వెలుగులు లేక అంధకారం. ఇదీ తాడికొండ జగన్ కాలనీలో నివాసం ఉంటున్న పేద కుటుంబాల పరిస్థితి. ఇంట్లో ఉండేందుకు అవసరమైన మౌలిక వసతులు మాత్రం అందని ద్రాక్షగానే మిగిలాయి. ప్రభుత్వాలు మారుతున్నా తమ పరిస్థితుల్లో మాత్రం మార్పు రావడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తాత్కాలిక చర్యలతో సరిపెడుతున్నారని, శాశ్వత పరిష్కారం మాత్రం చూపడం లేదని ఆరోపిస్తున్నారు.

### కాలనీలో రోడ్లు ఎక్కడ.?

కాలనీలో ప్రధానంగా వేధిస్తున్న సమస్య రోడ్లు. ఇళ్ల నిర్మాణం పూర్తయి కుటుంబాలు నివాసం ఉంటున్నా రాకపోకలకు సరైన రహదారులు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్లు మంజూరయ్యాయని చెబుతున్నా.. నిర్మాణ పనులు మాత్రం ముందుకు సాగలేదని కాలనీవాసులు చెబుతున్నారు. రోడ్డు



సౌకర్యం లేకపోవడంతో చిన్నపిల్లలను పాఠశాలకు పంపాలన్నా, వృద్ధులను ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు వెళ్లేందుకు కూడా అనుకూల పరిస్థితులు లేవని వాపోతున్నారు. ఎండాకాలంలో దుమ్ము, ధూళి.. వర్షాకాలంలో బురద, నీరు.. ఇలా కాలనీవాసులకు ప్రతి సీజన్ ఒక పరీక్షగా మారిందని చెబుతున్నారు.

### వర్షం వస్తే.. మోకాళ్ల లోతు నీరు

కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం మరో ప్రధాన సమస్య. వర్షం కురిసినప్పుడు నీరు బయటకు వెళ్లేందుకు కాలువలు లేక ఇళ్ల చుట్టూ నీరు నిలిచిపోతోందని నివాసులు చెబుతున్నారు. కొన్నిసార్లు మోకాళ్ల లోతు వరకు నీరు చేరుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు నిలిచిపోవడంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరుగుతున్నాయని అంటున్నారు. వర్షపు నీరు వెళ్లేందుకు కాలువలు నిర్మిస్తేనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వారు కోరుతున్నారు.

### తుమ్మ చెట్లు.. గడ్డి.. పాముల భయం

కాలనీ చుట్టూ, ఇళ్ల మధ్య తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కలు, గడ్డి విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో నివాస ప్రాంతం కంటే పొలాల మధ్య ఉన్న ప్రాంతంలా కనిపిస్తోందని స్థానికులు అంటున్నారు.

చెట్లు, గడ్డి మధ్య విషసర్పాలు సంచరిస్తున్నాయని, ముఖ్యంగా రాత్రివేళ బయటకు రావాలంటే భయపడాల్సి వస్తోందని చెబుతున్నారు. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రావడానికి కూడా ఆందోళన చెందుతున్నారని పేర్కొంటున్నారు. పాములు ఇళ్ల పరిసరాల్లోకి వస్తున్న సందర్భాలు ఉన్నాయని, వెంటనే పరిసరాలను శుభ్రం చేసి పిచ్చి మొక్కలు, తుమ్మ చెట్లను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

### రాత్రయితే చీకటే..

కాలనీలో విద్యుత్ సౌకర్యం ఉన్నప్పటికీ రాత్రివేళ తగినంత వెలుతురు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నివాసులు చెబుతున్నారు. వీధి దీపాల సమస్యను పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నామమాత్రపు చర్యలకే పరిమితమవుతున్నారని ఆరోపిస్తున్నారు. చీకట్లో పాములు, ఇతర విషపురుగులు తిరిగే ప్రమాదం ఉండటంతో రాత్రివేళ ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడాల్సి వస్తోందని అంటున్నారు.

**వీధి దీపాలను ఏర్పాటు చేసి, పనిచేయని లైట్లను వెంటనే మరమ్మతు చేయాలని కోరుతున్నారు.**

### కొళాయిలు ఇచ్చారు.. నీళ్లు మరిచారు

కాలనీలో మంచినీటి కోసం కొళాయిలు ఏర్పాటు చేసినా.. వాటి ద్వారా క్రమం తప్పకుండా నీరు అందకపోవడంతో ప్రయోజనం లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'కొళాయిలు ఇచ్చారు.. మంచినీళ్లు మరిచారు' అన్నట్టుగా పరిస్థితి తయారైందని వారు వాపోతున్నారు. తాగునీటి కోసం ఇతర ప్రాంతాలపై ఆధారపడాల్సి వస్తోందని చెబుతున్నారు.

ప్రతి ఇంటికీ క్రమబద్ధంగా మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని, వేసవిలో నీటి సమస్య మరింత తీవ్రం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

### అధికారులకు చెప్పినా.. చర్యలు శూన్యం

కాలనీ సమస్యలపై పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించడం లేదని నివాసులు చెబుతున్నారు. విద్యుత్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తాత్కాలికంగా లైట్లు వేయడం, మరమ్మతులు చేయడం తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని అంటున్నారు. ఎండీఓ, ఎమ్మార్వోతో పాటు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి కూడా సమస్యలను తీసుకెళ్లామని, అయినా హామీలు తప్ప పనులు కనిపించడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పెదవి విరుపులే తప్ప.. సమస్యల పరిష్కారానికి చర్యలు మాత్రం కనిపించడం లేదు" అని వారు అంటున్నారు.

### పార్టీలు మారినా.. పరిస్థితి మారలేదు

రాజకీయ పార్టీలు ఏవైనా.. ప్రభుత్వాలు మారినా తమ బతుకుల్లో మాత్రం మార్పు రావడం లేదని కాలనీవాసులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎన్నికల సమయంలో తమ సమస్యలను పట్టించుకుంటామని చెప్పే నాయకులు ఆ తర్వాత కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంతింటి కల నెరవేర్చిన ప్రభుత్వం.. ఆ ఇళ్లకు అవసరమైన రోడ్లు, కాలువలు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులను కూడా పూర్తిస్థాయిలో కల్పించాలని వారు కోరుతున్నారు.

### వృద్ధులు, మహిళలకు నరకయాతన

రోడ్లు లేకపోవడం వల్ల వృద్ధులు, గర్భిణులు, మహిళలు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసులు చెబుతున్నారు. అనారోగ్యంతో ఉన్న వారిని ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే వాహనం ఇంటి వరకు రాని పరిస్థితి ఉందని అంటున్నారు. వర్షాకాలంలో బురద, నీరు కారణంగా పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని చెబుతున్నారు. రాత్రివేళ చీకటి, పాముల భయం తోడవడంతో అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లడం కూడా కష్టంగా మారుతోందని వాపోతున్నారు.

### కాలనీ అభివృద్ధి చేస్తే..

రోడ్లు నిర్మించి, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేసి, వీధి దీపాలు ఏర్పాటు చేస్తే కాలనీ రూపురేఖలే మారిపోతాయని స్థానికులు చెబుతున్నారు. తుమ్మ చెట్లు, గడ్డిని తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు పాముల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.?

తాగునీటి సరఫరాను క్రమబద్ధీకరించి, ప్రతి ఇంటికీ సురక్షితమైన మంచినీరు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాలనీకి సరైన రహదారి ఉంటే అంబులెన్స్, ఆటోలు, ఇతర వాహనాలు సులభంగా రాకపోకలు సాగించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

### ఇప్పటికైనా పట్టించుకుంటారా?

జగన్ కాలనీలో నివాసం ఉంటున్న పేద కుటుంబాలు ప్రభుత్వం వైపు ఆశగా చూస్తున్నాయి. ఇళ్లు నిర్మించుకున్న తమకు కనీస మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని వారు అంటున్నారు. రోడ్లు మంజూరయ్యాయని చెప్పడం కాదు.. నిర్మించి చూపాలి. కాలువలు ప్రతిపాదనల్లో కాకుండా క్షేత్రస్థాయిలో కనిపించాలి. కొళాయిలు ఏర్పాటు చేయడం కాదు.. వాటి ద్వారా నిరంతరం మంచినీరు అందాలి. వీధి దీపాలు ఏర్పాటు చేసి రాత్రివేళ భద్రత కల్పించాలి. "మా ఇళ్లకు మేమే ఖర్చు పెట్టి చేరుకున్నాం.. ఇప్పుడు మా కాలనీకి ప్రభుత్వం రోడ్లు, కాలువలు, విద్యుత్, నీరు వంటి కనీస వసతులు కల్పించాలి. పిల్లలు, మహిళలు, వృద్ధులు భయపడకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఇకనైనా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలి" అని కాలనీవాసులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. సొంతింటి కల నెరవేరినా.. సౌకర్యాల కల మాత్రం ఇంకా కలగానే మిగిలింది. తాడికొండ జగన్ కాలనీకి మౌలిక వసతులు ఎప్పుడు వస్తాయోనని అక్కడి ప్రజలు ఎదురుచూస్తున్నారు.

# నన్ను కొట్టారు.. ఐఫోన్ దొంగిలించారు

## – వేములవాడ పోలీసులకు ఫోక్ సింగర్ మాధురి రాథోడ్ ఫిర్యాదు



వేములవాడ పట్టణంలో ఇటీవల జరిగిన ఒక వివాదం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఫోక్ సాంగ్స్ ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆర్టిస్టులు ఈశ్వర్ సాయి, మాధురి రాథోడ్‌ల వ్యక్తిగత వ్యవహారం బహిరంగంగా రచ్చకెక్కింది. ఇటీవలే విడుదలైన 'ప్రమీల' అనే ఫోక్ సాంగ్‌లో ఈ ఇద్దరూ జంటగా నటించి ప్రేక్షకులను అలరించారు. అయితే, ఆ పరిచయం కాస్తా వ్యక్తిగతంగా మారడంతో ఒక హోటల్‌లో వారు ఏకంతంగా ఉండగా.. వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది ఈశ్వర్ భార్య శరణ్య. దీంతో ఈ పంచాయితీ ఒక్కసారిగా ఇంటర్‌నెట్ మొత్తం వ్యాపించింది. అయితే ఈ ఘటన అనంతరం తీవ్ర మనస్తాపానికి గురైన ఫోక్ సాంగ్స్ ఆర్టిస్ట్ మాధురి రాథోడ్ పోలీసులను ఆశ్రయించారు. తనపై అకారణంగా దాడి చేశారని ఆమె వేములవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈశ్వర్ సాయి భార్య శరణ్య తనను అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా, ఎలాంటి కారణం లేకుండా తనపై చేయి చేసుకుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనపై భౌతిక దాడి చేయడమే కాకుండా, అక్కడి దృశ్యాలను వీడియోలు తీశారని, అంతేకాకుండా తన ఐఫోన్‌ను కూడా దొంగిలించారని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా సోషల్ మీడియా వేదికగా కొందరు కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మాధురి రాథోడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి మాధ్యమాల్లో తన వ్యక్తిగత జీవితంపై తప్పుడు పోస్టులు పెడుతూ పరువు నష్టం కలిగిస్తున్న వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులను కోరారు. మాధురి రాథోడ్ ఇచ్చిన ఫిర్యాదు స్వీకరించిన వేములవాడ పోలీసులు వెంటనే స్పందించి కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# మెగా 158 గ్లింప్స్ వచ్చేసింది

## – కాకా టైటిల్‌తో మెగాస్టార్ విధ్వంసం



మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న బర్త్‌డే ట్రీట్ వచ్చేసింది. చిరంజీవి హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ మెగా 158 టైటిల్‌తో పాటు రిలీజ్ డేట్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా శనివారం ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. అభిమానులు ఊహించినట్టుగానే ఈ చిత్రానికి 'కాకా' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్‌ను ప్రకటించడంతో పాటు సుమారు మూడు నిమిషాలకు పైగా ఉన్న పవర్‌ఫుల్ గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో చిరంజీవి ఎంతో స్టైలిష్‌గా, మాస్ లుక్‌లో కనిపించారు. గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథగా ఈ సినిమా ఉండబోతున్నట్లు గ్లింప్స్ ద్వారా స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. స్టైలిష్ యాక్షన్, మాస్ ఎలిమెంట్స్, పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో రూపొందిన గ్లింప్స్ మెగా అభిమానులను ఆకట్టుకుంటోంది. చిరంజీవిని ఆయనకు సరిగ్గా సరిపోయే మాస్ క్యారెక్టర్‌లో చూపించేందుకు దర్శకుడు బాబీ కొల్లి భారీగా ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. టైటిల్‌తో పాటు సినిమా రిలీజ్ డేట్‌ను కూడా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 2027 సంక్రాంతి కానుకగా జనవరి 13న 'కాకా' సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. దీంతో వచ్చే సంక్రాంతి బరిలో మెగాస్టార్ సినిమా కూడా నిలవనుంది.'కాకా' సినిమాకు బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో చిరంజీవి, బాబీ కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం రూ.200 కోట్లకు పైగా వసూళ్లు సాధించి మెగాస్టార్ కెరీర్‌లో ప్రత్యేక చిత్రంగా నిలిచింది.ఇప్పుడు అదే కాంబినేషన్ మరోసారి రిపీట్ కావడంతో 'కాకా'పై అంచనాలు భారీగా పెరిగాయి. ఈసారి కూడా చిరంజీవి ఇమేజ్‌కు తగ్గట్టుగా పక్కా కమర్షియల్ అంశాలు, యాక్షన్, ఎమోషన్‌తో కూడిన కథను బాబీ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో మలయాళ నటి అనస్వర రాజన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. అలాగే ప్రియమణి, బండ్ల గణేష్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. మెగాస్టార్‌తో పాటు ఇతర పాత్రలకు కూడా కథలో ప్రాధాన్యత ఉండేలా స్క్రిప్ట్‌ను రూపొందించినట్లు సమాచారం.సినిమాకు ఎస్.ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ కథాంశానికి తగ్గట్టుగా మాస్ బీజీఎం, పవర్‌ఫుల్ సాంగ్స్‌తో థమన్ మరోసారి తన మార్క్ చూపించనున్నారని అభిమానులు ఆశిస్తున్నారు. చిత్రంలో చిరు రెండు విభిన్న పాత్రలలో కనిపించనున్నట్టు గ్లింప్స్‌ని బట్టి చేస్తుంది. మధ్య వయస్కుడైన సత్యం రూపంలో హుందాగా కనిపించిన చిరు చివరలో యంగ్ అండ్ స్టైలిష్ లుక్‌లో కేక పెట్టించారు. గ్లింప్స్ మాత్రం ఓ రేంజ్‌లో ఉందని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం 'కాకా' షూటింగ్ కూడా శరవేగంగా కొనసాగుతోంది. ఇప్పటికే సినిమా చిత్రీకరణలో దాదాపు సగం భాగం పూర్తయినట్లు సమాచారం. మిగిలిన షూటింగ్‌ను కూడా త్వరగా పూర్తి చేసి, పోస్ట్ ప్రొడక్షన్ పనులను కంప్లీట్ చేసి సంక్రాంతి బరిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# అల్లు అర్జున్ 'రాకా'లో ఊహించని ప్రపంచం..


## – సెట్స్‌కు వెళ్లి షాకైన మంచు లక్ష్మీ ..!




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రాకా' పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అట్లీ తన గత చిత్రాలకు భిన్నంగా ఈసారి సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ కాన్సెప్ట్‌ను ఎంచుకోవడంతో.. ఈ సినిమా ఎలా ఉండబోతుందనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఇప్పటికే అల్లు అర్జున్ లుక్, అట్లీ మేకింగ్ స్టైల్ గురించి రకరకాల వార్తలు వైరల్ అవుతుండగా.. తాజాగా నటి మంచు లక్ష్మీ చేసిన కామెంట్స్ సినిమాపై మరింత హైప్‌ను పెంచుతున్నాయి. ఇటీవల మంచు లక్ష్మీ 'రాకా' షూటింగ్ జరుగుతున్న సెట్స్‌ను సందర్శించినట్లు తెలుస్తోంది. అక్కడ జరుగుతున్న చిత్రీకరణను చూసి తాను ఆశ్చర్యపోయానని ఆమె చెప్పుకొచ్చారు. ముఖ్యంగా సినిమా కోసం సృష్టించిన ప్రపంచం, భారీ సెట్స్, విజువల్ ఎలిమెంట్స్ తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు. ఇప్పటివరకు తాను చూడని ఒక కొత్త ప్రపంచాన్ని అక్కడ చూశానని మంచు లక్ష్మీ పేర్కొన్నారు. సినిమాలో భాగంగా కనిపించే కొన్ని జీవులు, ప్రాణుల డిజైన్లు కూడా తనను ఆశ్చర్యానికి గురిచేశాయని ఆమె వెల్లడించారు. దీంతో 'రాకా' సాధారణ యాక్షన్ సినిమా కాదనే విషయం మరింత స్పష్టమవుతోందనే చర్చ మొదలైంది. 'రాకా'ను సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో తెరకెక్కిస్తున్నట్లు ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మంచు లక్ష్మీ చేసిన వ్యాఖ్యలు సినిమాలోని ప్రపంచం ఎలా ఉండబోతుందనే ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. కొత్త తరహా విజువల్స్, భారీ యాక్షన్ సీక్వెన్సులు, ఊహకు అందని క్రియేచర్స్‌తో దర్శకుడు అట్లీ ఒక ప్రత్యేకమైన ప్రపంచాన్ని సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు కమర్షియల్ ఎంటర్‌టైనర్లతో ప్రేక్షకులను ఆకట్టుకున్న అట్లీ.. ఈసారి సైన్స్ ఫిక్షన్ జానర్‌ను ఎంచుకోవడం విశేషం. కథతో పాటు విజువల్ ఎక్స్‌పీరియన్స్‌కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలుస్తోంది.ఈ సినిమాలో అల్లు అర్జున్‌ను ఇప్పటివరకు చూడని విధంగా చూపించేందుకు అట్లీ ప్రత్యేకంగా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. బన్నీ విభిన్న గెటప్స్‌లో కనిపించనున్నాడనే వార్తలు ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తిని పెంచాయి. యాక్షన్, ఎమోషన్, సైన్స్ ఫిక్షన్ అంశాలను కలిపి ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది.అల్లు అర్జున్ పాన్ ఇండియా స్థాయిలో 'పుష్ప' సినిమాతో సొంతం చేసుకున్న క్రేజ్‌కు తగ్గట్టుగానే ఈ ప్రాజెక్ట్‌ను మరింత భారీ స్కేల్‌లో రూపొందించేందుకు మేకర్స్ ప్రయత్నిస్తున్నారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అల్లు అర్జున్, అట్లీ కలిసి ఎలాంటి విజువల్ వండర్‌ను సృష్టించబోతున్నారో తెలియాలంటే సినిమా విడుదల వరకు వేచి చూడాల్సిందే. ప్రస్తుతం మాత్రం మంచు లక్ష్మీ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ 'రాకా'పై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్తున్నాయి.

# రవితేజ 'ఇరుముడి' దూకుడు..

## కెరీర్‌లోనే సెన్సేషనల్ ఓపెనింగ్, చిరంజీవి రికార్డుకూ చెక్!




మాస్ మహారాజా రవితేజకు కొంతకాలంగా సరైన విజయం దక్కడం లేదు. ముఖ్యంగా 'ధమాకా' తర్వాత వచ్చిన వరుస సినిమాలు ఆశించిన స్థాయిలో మెప్పించకపోవడంతో ఆయన మార్కెట్‌పై కూడా ప్రభావం పడింది. తనకు బాగా కలిసొచ్చిన మాస్ కమర్షియల్ జానర్‌కు కాస్త భిన్నంగా ఈసారి ఆధ్యాత్మిక కథాంశాన్ని ఎంచుకున్నారు. తండ్రీకూతుళ్ల అనుబంధం, ఎమోషన్స్, యాక్షన్ థ్రిల్లర్ అంశాలను మేళవిస్తూ తెరకెక్కిన 'ఇరుముడి' తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటించగా.. సాయికుమార్, అజయ్ ఘోష్, స్వసిక విజయ్, బేబీ నక్షత్ర, రమేష్ ఇందిరా తదితరులు కీలక పాత్రలు పోషించారు. అయ్యప్ప స్వామి భక్తుల నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా ఆగస్టు 21న థియేటర్లలో విడుదలైంది. తొలి రోజే సినిమాకు పాజిటివ్ టాక్ రావడంతో బాక్సాఫీస్ వద్ద రవితేజ అభిమానుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.'ఇరుముడి' తొలి రోజు ఏకంగా రూ.24.20 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. ఇందులో ఇండియాలో రూ.17.20 కోట్ల గ్రాస్, రూ.14.80 కోట్ల నెట్ రాగా.. ఓవర్సీస్ నుంచి సుమారు రూ.7 కోట్ల గ్రాస్ వచ్చినట్లు తెలుస్తోంది. ఇది రవితేజ సోలో హీరోగా నటించిన సినిమాల్లోనే అత్యధిక ఓపెనింగ్‌గా నిలిచింది. ఇప్పటివరకు 'ధమాకా', 'టైగర్ నాగేశ్వరరావు' చిత్రాలు తొలి రోజు సుమారు రూ.8 కోట్ల స్థాయిలో ఓపెనింగ్స్ సాధించగా.. 'ఇరుముడి' వాటిని భారీ తేడాతో అధిగమించినట్లు సమాచారం. అడ్వాన్స్ బుకింగ్స్ విషయంలో కూడా 'ఇరుముడి' దూకుడు చూపించింది. ఈ ఏడాది విడుదలైన మెగాస్టార్ చిరంజీవి చిత్రం 'మన శంకరవర ప్రసాద్ గారు' అడ్వాన్స్ బుకింగ్స్‌లో సుమారు 31.6 వేల టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. అయితే 'ఇరుముడి' విడుదలకు ముందే 32.25 వేల టికెట్లను అడ్వాన్స్‌గా విక్రయించి ఆ రికార్డును దాటినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. రవితేజ కెరీర్‌లో ఇలాంటి ఓపెనింగ్ రావడం ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా వరుస పరాజయాల తర్వాత ఒక భిన్నమైన కథతో వచ్చి ఇంతటి రెస్పాన్స్ అందుకోవడం విశేషంగా మారింది. 'ఇరుముడి' చిత్రానికి సుమారు రూ.40 కోట్ల బడ్జెట్ అయినట్లు సమాచారం. థియేట్రికల్ బిజినెస్ దాదాపు రూ.20 కోట్ల వరకు జరిగినట్లు తెలుస్తోంది. నైజాం హక్కులు రూ.5.50 కోట్లు, సీడెడ్ రూ.2.25 కోట్లు, ఆంధ్రా రూ.8.25 కోట్లకు అమ్ముడైనట్లు సమాచారం. ఓవర్సీస్, రెస్ట్ ఆఫ్ ఇండియా కలిపి మరో రూ.4 కోట్ల బిజినెస్ జరిగినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. మొత్తంగా సినిమా బ్రేక్ ఈవెన్ సాధించాలంటే సుమారు రూ.21 కోట్ల షేర్ రావాల్సి ఉంటుందని అంచనా. తొలి రోజు వసూళ్లు, పాజిటివ్ టాక్‌ను చూస్తుంటే ఈ టార్గెట్‌ను త్వరగానే అందుకునే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రవితేజ కెరీర్‌లో రూ.100 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసిన చిత్రంగా ఇప్పటివరకు 'ధమాకా' నిలిచింది. ఇప్పుడు 'ఇరుముడి'కి తొలి రోజు నుంచే వస్తున్న స్పందన, వరుస సెలవులు కలిసిరావడంతో ఈ సినిమా కూడా రూ.100 కోట్ల క్లబ్‌లోకి వెళ్లే అవకాశాలపై చర్చ మొదలైంది.

# 'డీసీ' సినిమా కోసం లోకేష్ కనగరాజ్ కష్టాలు..

## – గాయం అయినా తగ్గేదేలే!



దర్శకుడిగా కోలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని, వరుస సంచలన విజయాలతో దూసుకుపోతున్న లోకేష్ కనగరాజ్ కేవలం మేకింగ్‌లోనే కాకుండా నటనలోనూ తన ప్రతిభను చాటుకుంటున్నారు. ముఖ్యంగా ఆయన 'ఐజ' చిత్రంలో ఒక విలక్షణమైన మరియు పవర్‌ఫుల్ పాత్రలో నటించి ప్రేక్షకులను ఎంతగానో అలరించడమే కాకుండా ఘన విజయాన్ని అందుకున్నారు. అయితే తెరపై కనిపించిన ఆ కొన్ని నిమిషాల అద్భుతమైన నటన వెనుక ఆయన పడిన కష్టం, ఎదుర్కొన్న సవాళ్లకు సంబంధించిన విషయాలు ప్రస్తుతం సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ సినిమాలోని పాత్ర డిమాండ్ మేరకు లోకేష్ కనగరాజ్ తన శరీరాన్ని పూర్తిగా మార్చుకోవాల్సి వచ్చింది. దీనికోసం ఆయన కఠినమైన డైట్ పాటిస్తూ, ముఖ్యంగా లోయర్ బాడీ వర్కవుట్స్ చేస్తూ శారీరకంగా విపరీతంగా శ్రమించారు. ఇందుకు సంబంధించిన ఒక మేకింగ్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, ఆయన పడిన కష్టాన్ని చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో ఒక యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నప్పుడు ఊహించని ప్రమాదం జరిగింది. తీవ్రమైన స్టంట్స్ చేసే క్రమంలో ఆయనకు 'షోల్డర్ డిస్లోకేషన్' అయ్యింది. ఈ తీవ్రమైన గాయం వల్ల ఆయన చాలా నొప్పితో ఇబ్బంది పడ్డారు. సాధారణంగా అయితే ఎవరైనా షూటింగ్‌కు బ్రేక్ ఇచ్చి విశ్రాంతి తీసుకునేవారు, కానీ లోకేష్ కనగరాజ్ మాత్రం సినిమా పట్ల, తన పాత్ర పట్ల ఉన్న అంకితభావంతో నొప్పిని సైతం లెక్కచేయకుండా షూటింగ్‌ను పూర్తి చేశారు. దర్శకుడిగా బిజీగా ఉంటూనే, మరోవైపు నటుడిగా ఇంతటి శారీరక శ్రమకోర్చి, గాయాలపాలైనా వెనకడుగు వేయకుండా ఆయన చూపించిన డెడికేషన్ చూసి సినీ ప్రముఖులు, తోటి నటీనటులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఒక నటుడిగా సక్సెస్ కావడానికి ఆయన ఎంత కష్టపడ్డారో ఈ ఘటనే నిదర్శనమని అభిమానులు కొనియాడుతున్నారు.

# నవ్వుల పూల వర్షం కురిపించేందుకు సిద్ధమవుతున్న 'ముగ్గురు కోతులు'..



జీఎస్ఆర్ క్రియేషన్స్ సమర్పణలో, స్కై ఫ్లేర్ నెట్‌వర్క్స్ సహ సమర్పణలో వస్తోన్న సరికొత్త చిత్రం 'ముగ్గురు కోతులు' శోభారాణి గరిమెల్ల నిర్మాణంలో కార్తీక్ గరిమెల్ల అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేయగా, ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.ఈ చిత్రంలో తేజ కొండపల్లి, గణేష్ బొడ్డ, దేవాన్ష్ హీరోలుగా నటిస్తుండగా, వర్షిక పాశం కథానాయికగా మెరవనున్నారు. సినిమా టైటిల్‌కు తగ్గట్టుగానే ఫస్ట్ లుక్ పోస్టర్ చాలా విభిన్నంగా డిజైన్ చేయబడింది. పోస్టర్‌లో ముగ్గురు హీరోలు విభిన్నమైన ఎక్స్‌ప్రెషన్స్‌తో కనిపించి నూతన ఉత్సాహాన్ని నింపుతున్నారు. ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు కడుపుబ్బా నవ్వులు పంచడం ఖాయమని ఫస్ట్ లుక్ చూస్తేనే అర్థమవుతోంది.ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రానికి సాంకేతిక నిపుణుల బృందం బలంగా నిలిచింది. ఎస్. సుహాస్ అందిస్తున్న సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుండగా, రాజ్ నోముల సినిమాటోగ్రఫీ (జఱఅవమ్ఖ్‌శీస్త్రతీఖుజూష్ట్రఎ) విజువల్స్ పరంగా అద్భుతంగా ఉండబోతున్నాయని తెలుస్తోంది. అలాగే జమీర్ షేక్ ఎడిటర్‌గా వ్యవహరిస్తుండగా, పీఆర్వోగా సాయి సతీష్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మున్ముందు ఈ సినిమా నుంచి వచ్చే ప్రతి అప్డేట్ ప్రేక్షకుల్లో మరింత క్యూరియాసిటీని పెంచడం ఖాయమని చిత్ర యూనిట్ ఎంతో కాన్ఫిడెంట్‌గా ఉంది. త్వరలోనే మరిన్ని ఆసక్తికరమైన విశేషాలతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు.

## ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందొద్దు

**- కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లాలో రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 3,340 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ ఉన్నాయని, ఖరీఫ్ 2026లో ఇప్పటివరకు 19,045 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేసినట్లు వెల్లడించారు. ప్రతిరోజూ మండలాల్లో 1,000 నుంచి 1,500 బ్యాగుల వరకు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఆగస్టు 7న ప్రారంభించిన ఎఫ్ఎస్ఎస్ (Framework for Fertilizer Sale) యాప్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. గతంలో జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా ఎరువులు కొనుగోలు చేసే అవకాశం ఉండగా, రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని డివిజన్ వారీగా కొనుగోలు చేసేలా యాప్‌ను మార్పులు చేసినట్లు చెప్పారు. అందుబాటులో ఉన్న ఎరువుల కంటే అధికంగా బుకింగ్ చేయడం వల్లే కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు.రైతులు అవసరానికి మించి ఎరువులు కొనుగోలు చేయకుండా, వ్యవసాయ శాఖ సూచనల మేరకు అవసరమైన పరిమాణంలో మాత్రమే యాప్ ద్వారా బుక్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

## సిరి టీవీ మీడియా హౌస్ ప్రారంభోత్సవంలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి

**ప్రజా సమస్యలను వెలుగులోకి తేవడంలో మీడియా కీలక పాత్ర.**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) సంగారెడ్డి పట్టణంలో సిరి టీవీ న్యూస్ ఛానల్ మీడియా హౌస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్‌రెడ్డి శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు సమాజానికి ఉపయోగపడే సమాచారాన్ని ప్రజలకు అందించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు, స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు మీడియా సంస్థలు కృషి చేయాలని సూచించారు. నూతనంగా ప్రారంభమైన సిరి టీవీ న్యూస్ ఛానల్ ప్రజా సమస్యలకు ప్రాధాన్యం ఇస్తూ, వాస్తవాలను నిష్పక్షపాతంగా ప్రజలకు చేరవేయాలని ఆకాంక్షించారు. సిరి టీవీ ఛానల్ మరింత అభివృద్ధి చెంది ప్రజల ఆదరణ పొందాలని కోరారు. అనంతరం సిరి టీవీ సిఎండి శివ శంకర్ పద్మా దేవేందర్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల. మల్లికార్జున్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగా నరేందర్, మున్సిపల్ కౌన్సిలర్ జూనియర్ అహ్మద్, మాజీ కౌన్సిలర్ ఆర్కే శ్రీనివాస్, సిరి టీవీ నిర్వాహకులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీసు అధికారుల సంఘం ఎన్నికల్లో సురేష్ బండారి ఘన విజయం



ధర్పల్లి(ప్రశ్న న్యూస్) జిల్లా పోలీసు అధికారుల సంఘం ఎన్నికల్లో ధర్పల్లి సర్కిల్ నుండి అత్యధిక మెజారిటీ తో హెడ్ కానిస్టేబుల్ సురేష్ బండారి (హెచ్.సి 1734) గెలుపొందడం జరిగింది.ప్రస్తుతం సిరికొండ పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా పని చేస్తున్న ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం తన శక్తి మేరకు కృషి చేస్తానని,తన పై నమ్మకం ఉంచి గెలిపించిన వారికి, పోలీస్ ఉన్నతాధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.

## మంథని మండలం గుంజపడుగు గ్రామంలో అల్పార కార్యక్రమంలో. దండవేణి సంధ్య బానేష్ గుంజపడుగు సర్పంచ్.



మంథని ( ప్రశ్న న్యూస్ ) తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అల్పాహారం పథకం గుంజపాడు గ్రామంలోని ఎంపీ ఎస్ పాఠశాల లో ప్రారంభించిన సర్పంచ్ దండేవేన సంధ్య బానేష్ ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు పాఠశాలకు అర్థ ఆకలితో ఉండకుండా ప్రవేశ పెట్టిన ఈ పథకం అందరి మన్ననలను పొందుతుందని ఆమె అన్నారు విద్యార్థులకు మంచి రుచి కరమైన అల్పాహారం అందిస్తున్న తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు ఇలా విద్యార్థులకు మంచి అల్పాహారం అందించడం వలన వారు చదువులో చురుగ్గా ఉంటారని అన్నారుఐటి మినిస్టర్ దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి సంధ్య బానేష్ కృతజ్ఞతలు తెలియజేశారు కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు చాలా ఆనందంగా పాల్గొన్నారు, అంతేకాకుండా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పని అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల అభినందిస్తున్నారు కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎలక లక్ష్మీ , వార్డు సభ్యులు దేవరకొండ పోచం, రాజేశ్వరి గ్రామస్తులు పాల్గొన్నారు

# పుట్టా మధు వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం

# "నోరు అదుపులో పెట్టుకోవాలి..

**శ్రీధర్‌బాబును విమర్శించే నైతిక హక్కు మధుకు లేదు"**

**అదే భాష మేం మాట్లాడితే తలకాయ ఏడ పెట్టుకుంటావు పుట్ట మధు....**

**పుట్ట మధు నువ్వు ఒక చదువు రాని దద్దమ్మవు..**

**మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ ఘాటు వ్యాఖ్యలు**



మంథని ( ప్రశ్న న్యూస్): రాష్ట్ర మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై మాజీ ఎమ్మెల్యే పుట్టా మధు చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ శ్రేణులు తీవ్రంగా ఖండించాయి. పుట్టా మధు తన స్థాయిని మరిచి శ్రీధర్‌బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ మండిపడ్డారు.రామగిరి మండలం బేగంపేట్ ఎక్స్‌రోడ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రొడ్డ బాపన్న పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీబీఐ విచారణ నేపథ్యంలో రాజకీయ భయాందోళనకు గురైన పుట్టా మధు ఫ్రస్ట్రేషన్‌తోనే శ్రీధర్‌బాబుపై ఆరోపణలు చేస్తున్నారని ఆయన విమర్శించారు.మంథని నియోజకవర్గాన్ని వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనులతో ముందుకు తీసుకెళ్తున్న శ్రీధర్‌బాబు పనితీరును చూసి ఓర్వలేకే పుట్టా మధు అక్కసు వెళ్లగక్కుతున్నారని ఆరోపించారు. నిరుద్యోగ నిర్మూలన, పరిశ్రమలు, పెట్టుబడులను తెలంగాణకు తీసుకురావడం కోసం మంత్రి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు."మంథని అభివృద్ధికి శ్రీధర్‌బాబు కృషి చేస్తుంటే.. గతంలో మంథని ప్రాంతాన్ని ఇసుక, మట్టి మాఫియాలకు అడ్డాగా మార్చింది పుట్టా మధు రాజకీయమే" అంటూ తొట్ల తిరుపతి యాదవ్ తీవ్ర ఆరోపణలు చేశారు. అయితే ఇవన్నీ కాంగ్రెస్ నాయకుడి ఆరోపణలేనని, సంబంధిత ఆరోపణలకు స్వతంత్ర నిర్ధారణ లేదని గమనించాలి. మంథని ప్రజలు దశాబ్దాలుగా శ్రీపాదరావు, శ్రీధర్‌బాబు కుటుంబాన్ని ఆదరిస్తున్నారని, ప్రజల తీర్పే తమ నాయకత్వానికి నిదర్శనమని అన్నారు.

మాజీ ఎమ్మెల్యే, మాజీ జెడ్పీ చైర్మన్‌గా పనిచేసిన పుట్టా మధు హుందాతనాన్ని కాపాడుకోవాలని, వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండాలని సూచించారు.మంథని నియోజకవర్గం అభివృద్ధి, తెలంగాణ రాష్ట్ర సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని, శ్రీధర్‌బాబు నాయకత్వంలో పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేస్తాయని తొట్ల తిరుపతి యాదవ్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు ఎల్లే రామ్మూర్తి, మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్, రామగిరి మండల బీసీ సెల్ అధ్యక్షుడు బండారి సదానందం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కండె పోషం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోత్కూరి అవినాష్ గౌడ్, సుందిళ్ల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ సత్యనారాయణ గౌడ్, పన్నూర్ సర్పంచ్ చిందం మహేష్, నవాబ్‌పేట సర్పంచ్ రొడ్డ మౌనిక, కుమార్ సర్పంచ్, ఆదివారం పేట సర్పంచ్ ఇల్లందుల సంజీవ్, నాగపల్లి సర్పంచ్ కొండవేణ దివ్య సుధాకర్, కాళేశ్వరం దేవస్థానం డైరెక్టర్ కాటం సత్యం, మాజీ సర్పంచులు తీగల సమ్మయ్య, ఎరుకల బాబురావు, జిల్లా యూత్ నాయకులు గొర్రె నరేష్ యాదవ్, మట్ట రాజు, పన్నూర్ ఉపసర్పంచ్ కావేటి మల్లేశ్వరి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు జాగరి రజిత, విజయ, రత్నాపూర్ కాంగ్రెస్ నాయకులు, బర్ల శ్రీకాంత్, గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ ఉపసర్పంచ్ నరేష్ యాదవ్, స్టాలిన్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ.. సచివాలయ హౌస్‌కీపింగ్ కార్మికుల జీతాలెప్పుడు పెంచుతారు.?

**- రూ.10,470తో కుటుంబాలను ఎలా పోషించాలి.?**

**- మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు రూ.21 వేలు.. మాకెందుకు ఈ వ్యత్యాసం.?**

**- వేతనాలు పెంచకపోతే దశలవారీ ఆందోళనలు : సీఐటీయూ**




మంగళగిరి(ప్రశ్న న్యూస్ ) రాజధాని ప్రాంతంలోని అసెంబ్లీ, సచివాలయంలో పనిచేస్తున్న హౌస్‌కీపింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ప్రస్తుతం నెలకు రూ.10,470 మాత్రమే చెల్లిస్తున్నారని, పెరిగిన నిత్యావసర ధరలు, ఇంటి అద్దెలు, ఇతర ఖర్చుల నేపథ్యంలో ఈ వేతనాలతో కుటుంబాలను పోషించడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేసింది. వేతనాలు పెంచకపోతే దశలవారీగా ఆందోళనలు చేపడతామని సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రవి, బి.లక్ష్మణరావు హెచ్చరించారు. మల్కాపురం సెంటర్‌లో శనివారం అసెంబ్లీ, సచివాలయం హౌస్‌కీపింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 2019లో హౌస్‌కీపింగ్ కార్మికుల వేతనాలు పెంచిన తర్వాత ఇప్పటివరకు గణనీయమైన పెంపు జరగలేదన్నారు. ఏడేళ్లలో నిత్యావసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలు, విద్య, వైద్యం తదితర ఖర్చులు భారీగా పెరిగినా కార్మికుల వేతనాల్లో మాత్రం మార్పు లేదని విమర్శించారు.

### ఒకే ప్రాంతంలో.. రెండు రకాల వేతనాలు

మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నెలకు రూ.21 వేలు చెల్లిస్తున్నారని, అదే రాజధాని ప్రాంతంలో అసెంబ్లీ, సచివాలయంలో హౌస్‌కీపింగ్ పనులు చేస్తున్న కార్మికులకు కేవలం రూ.10,470 మాత్రమే ఇవ్వడం అన్యాయమని నాయకులు పేర్కొన్నారు. కనీస వేతనాల అమలులో ఈ వ్యత్యాసాన్ని ప్రభుత్వం సరిచేయాలని డిమాండ్ చేశారు. వేతనాల పెంపు కోసం ఇప్పటికే మంత్రి నారాయణ, ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సురేష్‌కుమార్, సీఆర్డీఏ కమిషనర్ విజయరామరాజు, అదనపు కమిషనర్ పి.కార్తీక్, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌లను కలిసి సమస్యను వివరించినట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారని, అయితే ఇప్పటివరకు వేతనాల పెంపుపై స్పష్టమైన నిర్ణయం వెలువడలేదన్నారు

రాజధానిని ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వం చెబుతోందని, అదే రాజధానిలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఎందుకు అమలు చేయడం లేదని నాయకులు ప్రశ్నించారు. పెద్ద సంస్థలకు భూములు కేటాయిస్తున్న ప్రభుత్వం.. కార్మికుల న్యాయమైన వేతనాల విషయంలో మాత్రం ఎందుకు వెనుకడుగు వేస్తోందని నిలదీశారు. అసెంబ్లీ, సచివాలయం హౌస్‌కీపింగ్ కార్మికులకు నెలకు రూ.21 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.వేతనాల పెంపుపై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోకపోతే దశలవారీగా ఆందోళనలు ఉధృతం చేస్తామని, తద్వారా తలెత్తే పరిస్థితులకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు.కార్యక్రమంలో కె.గ్రేస్, బుజ్జి, సుజాత, బుల్లమ్మాయి, ఇందిర, పుష్ప, కోటేశ్వరి, అమ్ములు, భవ్య, సురేష్, నిర్మల, భారతి, సాధన, స్వప్న, రాజకుమారి, శివమ్మ, లక్ష్మి,

## కలిసికట్టుగా కదలాలి.. స్థానిక పోరులో గెలవాలి

**-పార్టీ బలోపేతానికి శ్రేణులు సిద్ధం కావాలి**

**-కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

**- మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు**



అచ్చంపేట(ప్రశ్న న్యూస్) రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కలిసికట్టుగా కదిలి, అన్ని గ్రామాల్లో పోటీ చేసి విజయం సాధించేలా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పిలుపునిచ్చారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. శనివారం అచ్చంపేట మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో నంబూరు శంకరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకం కావాలని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీ అభ్యర్థులు పోటీ చేసి విజయం సాధించేలా కృషి చేయాలని సూచించారు.

### 'సూపర్ సిక్స్' ఏమైంది.?

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో విఫలమైందని నంబూరు శంకరరావు విమర్శించారు. ఎన్నికల సమయంలో 'సూపర్ సిక్స్' పేరుతో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన అనంతరం రైతులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి, వైఎస్సార్‌సీపీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.సమావేశంలో అచ్చంపేట మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్కానింగ్ పాయింట్‌పై ఈవో ఆకస్మిక తనిఖీ

**వీఐపీ ఎంట్రీ రిజిస్టర్ పరిశీలన,**

**సెల్‌ఫోన్లపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశం**



విజయవాడ(ప్రశ్న న్యూస్) ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఈవో వీకే సీనా నాయక్ స్కానింగ్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది విధుల నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్కానింగ్ పాయింట్ వద్ద నిర్వహిస్తున్న వీఐపీ ఎంట్రీ రిజిస్టర్‌తో పాటు ఇతర రికార్డులను తనిఖీ చేశారు. భక్తుల ప్రవేశ ప్రక్రియ, తనిఖీల నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు.స్కానింగ్ పాయింట్ ఇన్‌ఛార్జి, జూనియర్ అసిస్టెంట్ అనురాధకు ఈవో పలు సూచనలు చేశారు. భద్రతా నిబంధనల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. సిబ్బంది అప్రమత్తంగా, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.ఆలయ భద్రతలో భాగంగా స్కానింగ్ పాయింట్ వద్ద సెల్‌ఫోన్ల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈవో సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా తనిఖీలను వేగవంతంగా నిర్వహించడంతో పాటు భద్రతా ప్రమాణాల్లో రాజీ పడొద్దని స్పష్టం చేశారు.భక్తుల రద్దీ సమయాల్లోనూ భద్రతా విధానాలను కచ్చితంగా అమలు చేయాలని, స్కానింగ్ పాయింట్ వద్ద విధులు నిర్వహించే ప్రతి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఈవో సీనా నాయక్ ఆదేశించారు.

# బకాయిల భారంలో విశ్రాంత ఉద్యోగులు

- నిధుల కొరతతో కునారిల్లుతున్న ప్రభుత్వం
- రిటైర్మెంట్ బెనిఫిట్ల కోసం ఏళ్ల తరబడి నిరీక్షణ
- వేల కోట్ల బకాయిలు.. ఆర్థిక ఇబ్బందుల్లో విశ్రాంత
- ఉద్యోగుల కుటుంబాలకు సకాలంలో అందని సొమ్ము
- కోర్టు ఆదేశాలున్నా కొనసాగుతున్న జాప్యం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జీవితంలో అత్యంత విలువైన కాలాన్ని ప్రభుత్వ సేవకే అంకితం చేసిన ఉద్యోగులు.. పదవీ విరమణ అనంతరం ప్రశాంతంగా జీవించాల్సిన సమయంలో తమకు రావాల్సిన సొమ్ము కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, జీపీఎఫ్ తదితర ప్రయోజనాల బకాయిలు భారీగా పేరుకుపోతుండటంతో విశ్రాంత ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

## ఏటా వేల మంది రిటైర్మెంట్.. పెరుగుతున్న ఆర్థిక భారం

తెలంగాణలో ఏటా వేలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ పొందుతున్నారు. 2024లోనే సుమారు 7,995 మంది ఉద్యోగులు రిటైర్ కాగా.. వారికి సంబంధించిన దాదాపు రూ.8,200 కోట్ల బకాయిలు పేరుకుపోయినట్లు సమాచారం. రాబోయే కాలంలో మరింత మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో ప్రభుత్వంపై ఆర్థిక భారం మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.

ఒకవైపు సంక్షేమ పథకాలకు భారీగా నిధులు కేటాయించాల్సి ఉండటం.. మరోవైపు ఉద్యోగుల జీతాలు, పింఛన్లు, పదవీ విరమణ ప్రయోజనాలకు నిధులు సమకూర్చాల్సి రావడంతో ప్రభుత్వ ఆర్థిక నిర్వహణపై తీవ్ర ఒత్తిడి ఏర్పడుతోంది.

సొమ్ము కోసం

## ఎదురుచూపులు.. కుటుంబాల్లో ఆందోళన

ఉద్యోగ విరమణ అనంతరం వచ్చే గ్రాట్యుటీ, జీపీఎఫ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి మొత్తాలు విశ్రాంత ఉద్యోగులకు ఎంతో కీలకం. పదవీ విరమణ సమయంలో పిల్లల చదువులు, వివాహాలు, గృహ నిర్మాణం, అప్పుల చెల్లింపులు, కుటుంబ అవసరాల కోసం ఈ మొత్తాలపై ఆధారపడే కుటుంబాలు అనేకం.

అయితే బకాయిలు సకాలంలో అందకపోవడంతో ఇప్పటికే అప్పుల్లో ఉన్న కొందరు విశ్రాంత ఉద్యోగులు మరింత ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తమవుతోంది.

## కోర్టు ఆదేశాలు ఉన్నా.. పరిస్థితిలో మార్పెప్పుడు.?

పదవీ విరమణ ప్రయోజనాలను సకాలంలో చెల్లించకపోవడంపై తెలంగాణ హైకోర్టు పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేసి, ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాల చెల్లింపులపై ఆదేశాలు జారీ చేసిన సందర్భాలు ఉన్నాయి. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో బిల్లుల ప్రాసెసింగ్, నిధుల విడుదలలో జాప్యం కొనసాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.కొంతమంది ఉన్నతాధికారుల బిల్లులు ప్రాసెస్ అయినప్పటికీ.. నిధులు ఖాతాల్లో జమ కావడానికి సమయం పడుతుండటంతో విశ్రాంత ఉద్యోగుల ఎదురుచూపులు కొనసాగుతున్నాయి.

## బకాయిల కోసం ఎదురుచూస్తూ విషాద ఘటనలు

బకాయిల కోసం ఎదురుచూస్తున్న కొందరు విశ్రాంత ఉద్యోగుల కుటుంబాల్లో విషాద ఘటనలు చోటుచేసుకున్నట్లు వచ్చిన వివరాలు పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. హనుమకొండకు చెందిన రిటైర్డ్ జూనియర్ అసిస్టెంట్ బాలగోని లక్ష్మణ్ కుమార్ తనకు రావాల్సిన సుమారు రూ.30 లక్షల బకాయిల కోసం ఎదురుచూస్తూ తీవ్ర మనోవేదనకు గురయ్యారని, అనంతరం బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందినట్లు సమాచారం. ఆయన కుటుంబం ఆస్పత్రి ఖర్చుల కోసం అప్పుల్లో కూరుకుపోయినట్లు తెలుస్తోంది.అదేవిధంగా మహబూబాబాద్‌కు చెందిన రిటైర్డ్ హెడ్‌మాస్టర్ కొండేటి సోమిరెడ్డి సుమారు రూ.54 లక్షల పదవీ విరమణ ప్రయోజనాల కోసం ఎదురుచూస్తుండగా, అప్పుల ఒత్తిడిని తట్టుకోలేక గుండెపోటుతో మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనలు నిజమైతే.. కేవలం బకాయిల సమస్యగా కాకుండా విశ్రాంత ఉద్యోగుల జీవన భద్రతకు సంబంధించిన తీవ్రమైన అంశంగా ప్రభుత్వం పరిగణించాల్సిన అవసరం ఉంది.

## ప్రభుత్వం దృష్టి సారించాల్సిన సమయం

ప్రభుత్వ ఉద్యోగి తన జీవితంలో దశాబ్దాల పాటు ప్రజలకు సేవ చేసిన అనంతరం పదవీ విరమణ పొందుతాడు. ఆ తర్వాత తనకు చట్టబద్ధంగా రావాల్సిన ప్రయోజనాల కోసం నెలలు, సంవత్సరాలు ఎదురుచూడాల్సిన పరిస్థితి రావడం ఆందోళనకరం.

నిధుల కొరత ఉంటే ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఆర్థిక ప్రణాళిక రూపొందించి పదవీ విరమణ బకాయిలను ప్రాధాన్యత క్రమంలో చెల్లించే విధానం తీసుకురావాలని విశ్రాంత ఉద్యోగులు కోరుతున్నారు. పెండింగ్ బిల్లులపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించి, అర్హత ఉన్న ప్రతి ఉద్యోగికి సకాలంలో నిధులు అందేలా స్పష్టమైన కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉంది.

## హక్కుగా రావాల్సిన సొమ్ము కోసం.. ఎందుకీ నిరీక్షణ.?

ప్రభుత్వ సేవలో ఉన్నప్పుడు ఉద్యోగి విధులు నిర్వర్తించడంలో ఎలాంటి ఆలస్యం ఉండదు. మరి అదే ఉద్యోగి పదవీ విరమణ చేసిన తర్వాత అతనికి రావాల్సిన ప్రయోజనాల చెల్లింపులో ఎందుకు జాప్యం?బకాయిలు కేవలం ప్రభుత్వ లెక్కల్లోని సంఖ్యలు కావు.. ప్రతి బకాయి వెనుక ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు, ఒక ఆశ ఉంటుంది. విశ్రాంత ఉద్యోగుల జీవితంలోని చివరి దశ ప్రశాంతంగా, గౌరవంగా సాగేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని పెండింగ్‌లో ఉన్న పదవీ విరమణ ప్రయోజనాలను విడుదల చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# పిల్లల చేతుల్లో పుస్తకాలా.. కత్తులా.?

- పదో తరగతి వయసులోనే నేరాల బాట - తల్లిదండ్రుల పర్యవేక్షణ ఎక్కడ.?
- డబ్బు, జల్సాలు, వేగం, మత్తు, ఆన్‌లైన్ వ్యసనాలు
- తప్పుదారి పడుతున్న బాల్యం, పట్టించుకోని స్కూల్ యజమాన్యాలు



(తోట వెంకట్ -- ప్రజా ప్రశ్న ఏపీ బ్యూరో )

కొన్ని వార్తలు చదివి మరిచిపోవచ్చు. మరికొన్ని ఘటనలు మాత్రం మనసులో ప్రశ్నలుగా మిగిలిపోతాయి. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపా రెడ్డి హత్య కేసు కూడా అలాంటిదే. పోలీసులు వెల్లడించిన దర్యాప్తు వివరాల ప్రకారం.. ఆమె వద్ద చదువుకున్న ఇద్దరు పదో తరగతి విద్యార్థులపై హత్య ఆరోపణలు రావడం సమాజాన్ని తీవ్రంగా కలచివేస్తోంది. కేసులోని నేరపూరిత అంశాలు న్యాయస్థానంలో తేలాల్సి ఉన్నప్పటికీ.. ఈ ఘటన మన ముందుంచిన సామాజిక ప్రశ్న మాత్రం చాలా పెద్దది. ఒక్క కుటుంబాన్ని, ఒక్క పాఠశాలను ప్రశ్నించే అంశాలు కావు. పిల్లల పెంపకం, కుటుంబ వ్యవస్థ, విద్యా విధానం, స్నేహ వాతావరణం, సామాజిక ప్రభావం.. అన్నింటినీ ప్రశ్నించే అంశాలు.

**పదో తరగతి.. కీలక మలుపు** పదో తరగతి వయసు పిల్లల జీవితంలో అత్యంత కీలకమైన దశ. చదువు, పరీక్షలు, భవిష్యత్తు లక్ష్యాలపై దృష్టి పెట్టాల్సిన సమయం. డాక్టర్ కావాలని.. ఇంజినీర్ కావాలని.. పోలీసు, సైన్యంలో చేరాలని.. మంచి ఉద్యోగం సంపాదించి తల్లిదండ్రులకు అండగా నిలవాలని కలలు కనే వయసు.కానీ అదే వయసులో డబ్బు, జల్సాలు, బైకులు, మత్తు పదార్థాలు, ఆన్‌లైన్ గేమ్స్, సోషల్ మీడియా ప్రభావం, అర్ధరాత్రి వరకు తిరుగుడు, చెడు స్నేహాలు వంటి అంశాలు పిల్లల ఆలోచనలను ప్రభావితం చేస్తే పరిస్థితి ప్రమాదకరంగా మారుతుంది. ఒక తప్పు స్నేహం.. మరో తప్పు అలవాటుకు దారితీయొచ్చు. ఒక చిన్న అబద్ధం.. పెద్ద నేరానికి దారి తీయొచ్చు. మొదట సరదాగా మొదలైన అలవాటు.. చివరకు జీవితాన్ని నాశనం చేసే వ్యసనంగా మారొచ్చు.

**మార్కులు చూస్తున్నారు.. మార్పులు చూస్తున్నారా.?** పిల్లల మార్కులు తగ్గితే తల్లిదండ్రులు వెంటనే స్పందిస్తారు. ర్యాంకు పడిపోతే పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులతో మాట్లాడతారు. పరీక్షల్లో తక్కువ మార్కులు వస్తే ట్యూషన్లు పెడతారు.కానీ పిల్లల ప్రవర్తనలో మార్పు వస్తే.?అది గమనిస్తున్నారా.?ఎవరితో స్నేహం చేస్తున్నారు.? ఎక్కడికి వెళ్తున్నారు.? ఎవరితో గంటల తరబడి ఫోన్‌లో మాట్లాడుతున్నారు.? ఎందుకు తరచూ డబ్బు అడుగుతున్నారు.? ఖర్చు పెట్టే విధానంలో అకస్మాత్తుగా మార్పు ఎందుకు వచ్చింది.? రాత్రిళ్లు ఫోన్ ఎందుకు వదలడం లేదు.? ఆన్‌లైన్‌లో ఏం చూస్తున్నారు.? ఒక్కసారిగా కోపం ఎందుకు పెరిగింది.? కుటుంబ సభ్యులతో మాట్లాడటం ఎందుకు తగ్గింది.? అర్ధరాత్రి రోడ్లపై ఎందుకు తిరుగుతున్నారు.?ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకునే ప్రయత్నం చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే.పిల్లల పుస్తకాల బ్యాగ్ తనిఖీ చేస్తున్నారు, వారి మనసులో ఏం ఉందో తనిఖీ చేస్తున్నామా.?

**డబ్బు.. జల్సా.. స్టైల్** చిన్న వయసులోనే ఖరీదైన ఫోన్లు, బైకులపై మోజు, ఖరీదైన దుస్తులు, జల్సా జీవితం వంటి వాటిపై పిల్లలకు ఆకర్షణ పెరగడానికి తల్లిదండ్రుల కారణం. అందరూ చేస్తున్నారనే కారణంతో తామూ చేయాలనే ఒత్తిడి పిల్లల్లో ఏర్పడుతోంది.డబ్బు కావాలి. కానీ డబ్బు ఎక్కడి నుంచి వస్తుందో పట్టించుకోరు. ఒకసారి తల్లిదండ్రుల వద్ద నుంచి దొంగతనంగా తీసుకోవచ్చు. మరోసారి స్నేహితుడి వద్ద అడగవచ్చు. ఆ తర్వాత మరింత డబ్బు అవసరం కావచ్చు.అక్కడే తప్పుదారి మొదలయ్యే ప్రమాదం ఉంది.పిల్లలకు "డబ్బు సంపాదించాలి" అని చెప్పడం ఎంత ముఖ్యమో.. "డబ్బు కోసం తప్పు చేయకూడదు" అని చెప్పడం అంతకంటే ముఖ్యం అని తల్లిదండ్రులు పిల్లలకు నేర్పించాలి.

**వాహనాల వేగం.. ప్రాణాలతో చెలగాటం** చిన్న వయసులోనే ద్విచక్ర వాహనాలపై అతి వేగం మరో ప్రమాదకర ధోరణి. రోడ్డు మీద వేగంగా వెళ్లడమే గొప్పతనంగా భావించడం, స్నేహితుల ముందు తన ప్రతిష్ఠను చూపించుకోవడానికి ప్రమాదకర విన్యాసాలు చేయడం చూస్తున్నాం.ఇక్కడ తల్లిదండ్రుల బాధ్యత చాలా కీలకం.పిల్లల చేతికి వాహనం ఇవ్వడం మాత్రమే కాదు.. వాహనం నడిపే వయసు వచ్చిందా.? నిబంధనలు తెలుసా.? రోడ్డు భద్రత గురించి అవగాహన ఉందా.? అనే విషయాలు కూడా చూడాలి.

**"ఏమీ కాదు.. పిల్లాడే కదా"**
**అనే నిర్లక్ష్యం ఒక్కోసారి జీవితాంతం మిగిలే విషాదాన్ని తెచ్చిపెడుతుంది**

మద్యం.. సిగరెట్.. మొదట సరదా.. తర్వాత వ్యసనం స్నేహితుల ఒత్తిడి, సినిమా ప్రభావం, సోషల్ మీడియా చూపించే జీవనశైలి వంటి కారణాలతో కొందరు విద్యార్థులు చిన్న వయసులోనే సిగరెట్లు, మద్యం, గంజాయి వంటి వాటికి ఆకర్షితులవుతున్నారనే ఆందోళనలు ఉన్నాయి. తొలి దశలోనే తల్లిదండ్రులు ఇవన్నీ గమనించాలి.బట్టల నుంచి ప్రవర్తన వరకు, మాట తీరు నుంచి స్నేహితుల వరకు మార్పులు కనిపిస్తే ప్రశ్నించాలి. పిల్లలతో గొడవపడటం కాదు.. వారితో మాట్లాడాలి.

ఎందుకు చేస్తున్నావు.?" అని అడగడం కంటే.. ఏం జరుగుతోంది.? నీకు ఏదైనా సమస్య ఉందా.? అని అడిగితే పిల్లలు మనసు విప్పే అవకాశం ఎక్కువ.ఆన్‌లైన్ గేమ్స్.. వాస్తవం మరిచే ప్రమాదంస్మార్ట్‌ఫోన్ ఇప్పుడు పిల్లల చేతిలో సాధారణ వస్తువుగా మారింది. చదువుకు ఉపయోగపడే సాంకేతికతే.. నియంత్రణ లేకపోతే సమస్యలకు కారణమవుతోంది.గంటల తరబడి ఆన్‌లైన్ గేమ్స్, సోషల్ మీడియా, వీడియోలు, తెలియని వ్యక్తులతో పరిచయాలు.. ఇవన్నీ పిల్లల మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.గేమ్‌లో ఓడిపోయినా మళ్లీ ఆడొచ్చు. కానీ జీవితంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలను వెనక్కి తీసుకోలేం.అందుకే తల్లిదండ్రులు పిల్లల ఫోన్ వినియోగంపై నిఘా పెట్టాలి. అయినంతవరకు పిల్లలకు సెల్ ఫోన్ దూరంగా పెట్టడమే మంచిది. ప్రతి కదలికను అనుమానించడం కాదు. వారితో మాట్లాడే అలవాటు పెంచుకోవాలి.

**హెయిర్ కటింగ్.. దుస్తులు.. చిన్న విషయాలేనా.?**పిల్లల హెయిర్ కటింగ్, దుస్తుల విషయంలో తల్లిదండ్రులు పూర్తిగా నిర్లక్ష్యం చేయకూడదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవల పిల్లల హెయిర్ కటింగ్ పెంచుకుని పోకిరిల్ల కనిపిస్తున్న తల్లిదండ్రులు పట్టించుకోకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇది ఒక్కటే నేరానికి కారణమని చెప్పలేం. అయితే పిల్లలలో ఏర్పడుతున్న మొత్తం ప్రవర్తనా మార్పులను గమనించడంలో భాగంగా తల్లిదండ్రులు వారి రూపురేఖలు, స్నేహాలు, అలవాట్లపై శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది.అయితే జుట్టు, దుస్తుల ఆధారంగా ఒక విద్యార్థి మంచివాడా చెడ్డవాడా అని నిర్ణయించడం మాత్రం సరైంది కాదు. అయితే హెయిర్ కటింగ్, సాంప్రదాయ బట్టలు వేసుకోవడం వంటిది వాళ్ళ గుణాలను సూచించవచ్చు, అవసరం పిల్లల ప్రవర్తన, ఆలోచనలు, అలవాట్లు, మానసిక స్థితిని అర్థం చేసుకోవడం.

**ప్రేమ పేరుతో ప్రమాదాలు** యుక్తవయసులో ఆకర్షణలు సహజం. కానీ వాటిని ఎలా ఎదుర్కోవాలో పిల్లలకు తెలియజేయాలి. ప్రేమలో విఫలమయ్యామనే బాధతో ఆత్మహత్యలకు పాల్పడటం, ఇతరులపై దాడులు చేయడం వంటి ఘటనలు సమాజాన్ని కలచివేస్తున్నాయి.పిల్లలకు భావోద్వేగాలను నియంత్రించుకోవడం నేర్పాలి."నచ్చినది దక్కకపోతే జీవితం ముగిసిపోయినట్లు కాదు" అనే విషయాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలి. ఎప్పుడు పుస్తకాలలో పాఠాలు చెబితే మరి జీవిత పాఠాలు ఎవరు చెప్పాలి.

**పాఠశాల యజమాన్యాలది కూడా పూర్తి బాధ్యత** పాఠశాల అంటే కేవలం పాఠ్యపుస్తకాలు, పరీక్షలు, మార్కులు కాదు. అది వ్యక్తిత్వాన్ని నిర్మించే ప్రదేశం.విద్యార్థి ప్రవర్తనలో అకస్మాత్తుగా మార్పు కనిపిస్తే ఉపాధ్యాయులు గమనించాలి. తరగతిలో ఒంటరిగా ఉండటం, విపరీతమైన కోపం, తరచూ గైర్హాజరు, అనుమానాస్పద స్నేహాలు, చదువుపై పూర్తిగా ఆసక్తి కోల్పోవడం వంటి సంకేతాలను తేలిగ్గా తీసుకోకూడదు.అవసరమైతే పాఠశాలల్లో కౌన్సెలింగ్ అందుబాటులో ఉండాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పిల్లల సమస్యలను పరిష్కరించాలి.విద్యార్థిని పరీక్షలో ఫెయిల్ కాకుండా చూడటం ఎంత ముఖ్యమో.. జీవితంలో తప్పు దారిలోకి వెళ్లకుండా కాపాడటం అంతకంటే ముఖ్యం.

**కుటుంబమే.. తొలి పాఠశాల** ఒకప్పుడు కుటుంబమే పిల్లలకు తొలి పాఠశాల. తాతయ్యలు, అమ్మమ్మలు, తల్లిదండ్రులు కథలు చెప్పేవారు. మంచి--చెడు వివరించేవారు. పెద్దలను గౌరవించడం, చిన్నలను ప్రేమించడం, ఇతరుల బాధను అర్థం చేసుకోవడం, తప్పు చేస్తే ఒప్పుకోవడం వంటి విలువలను ఇంట్లోనే నేర్పించేవారు.ఇప్పుడు జీవితం వేగమైంది. తల్లిదండ్రులకు ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర బాధ్యతలు పెరిగాయి. పిల్లలకు అవసరమైన వస్తువులు కొనివ్వడానికి సమయం ఉంది.కానీ పిల్లల పక్కన కూర్చొని మాట్లాడటానికి సమయం ఉందా.? ఖరీదైన ఫోన్ ఇవ్వొచ్చు. మంచి పాఠశాలలో చేర్పించొచ్చు. కానీ వారానికి కొంత సమయం కేటాయించి.. నీకు ఏం బాధగా ఉంది.? నీకు ఏం కావాలి.? ఎవరితో ఎక్కువగా తిరుగుతున్నావు.? నీకు ఏమైనా సమస్య ఉందా? అని అడగడం మరచిపోవద్దు. రూపా రెడ్డి కేసు చెబుతున్న పాఠం

రూపా రెడ్డి హత్య కేసులో పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఐదు ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేసి సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించాయి. హత్య అనంతరం పాఠశాలకు సెలవులు ఇవ్వడం, తిరిగి ప్రారంభమైన తర్వాత గైర్హాజరైన విద్యార్థులను విచారించడం, అనుమానితుల వద్ద నగదు గుర్తించడం వంటి అంశాలు దర్యాప్తులో కీలకంగా మారాయి.పోలీసుల ప్రకారం ఒక నిందితుడి వద్ద లభించిన రూ.1.54 లక్షల నగదుపై రక్తపు మరకలు ఉండటంతో ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించగా.. ఆ రక్తం రూపా రెడ్డిదేనని నిర్ధారణ అయింది. ఇద్దరు నిందితులు మైనర్లు కావడంతో జువెనైల్ జస్టిస్ కోర్టు ముందు హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.ఇవి దర్యాప్తు సంస్థలు వెల్లడించిన ఆరోపణలు, వివరాలు మాత్రమే. న్యాయ ప్రక్రియలో నిజానిజాలు తేలాల్సి ఉంది.







కానీ ఈ కేసు మనకు ఇచ్చే సామాజిక హెచ్చరిక మాత్రం ఇప్పుడే వినాలి.నేరం జరిగిన తర్వాత కాదు.. ముందే మేల్కొందాం పిల్లలు తప్పు చేసిన తర్వాత వారిని నిందించడం సులువు. కానీ తప్పు దారిలోకి వెళ్లే ముందు వారి చేతిని పట్టుకోవడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం బాధ్యత. పిల్లల హెయిర్ కటింగ్ చూసి మాత్రమే తీర్పు చెప్పొద్దు. దుస్తులు చూసి మాత్రమే మంచిచెడ్డలు నిర్ణయించొద్దు. అదే సమయంలో పిల్లల ప్రతి ప్రవర్తనా మార్పును పూర్తిగా నిర్లక్ష్యం చేయొద్దు. నియంత్రణతో పాటు సంభాషణ కావాలి. శిక్షతో పాటు అవగాహన కావాలి. స్వేచ్ఛతో పాటు బాధ్యత నేర్పాలి. చదువుతో పాటు విలువలు నేర్పాలి. ముందు తరాన్ని మనమే కాపాడాలి

పిల్లల భవిష్యత్తు కేవలం వారి చేతుల్లోనే లేదు. కుటుంబం, పాఠశాల, స్నేహ వాతావరణం, సమాజం.. అన్నీ కలిసి దాన్ని నిర్మిస్తాయి. పిల్లలకు ఎంత డబ్బు ఇస్తున్నామన్నది కాదు.. ఎంత సమయం ఇస్తున్నాం అన్నదే ముఖ్యం. ఎన్ని మార్కులు తెచ్చారన్నది కాదు.. ఎలాంటి మనుషులుగా ఎదుగుతున్నారన్నదే అసలు విజయం.ఎంత ఖరీదైన పాఠశాలలో చదివారన్నది కాదు.. తప్పు ముందు 'వద్దు' అని చెప్పగల విలువలు నేర్చుకున్నారా అన్నదే ముఖ్యం.

రూపా రెడ్డి హత్య ఘటనను కేవలం మరో క్రైమ్ వార్తగా మరిచిపోకూడదు. ఒక ఉపాధ్యాయురాలి మరణం, ఇద్దరు మైనర్లపై వచ్చిన హత్య ఆరోపణలు.. ఈ రెండూ సమాజానికి తీవ్రమైన హెచ్చరికలు. పిల్లల చేతుల్లో పుస్తకాలు ఉండాలి.. కత్తులు కాదు.వారి కళ్లలో భవిష్యత్తు కలలు ఉండాలి.. నేరపు నీడలు కాదు.వారి జీవితాల్లో విజయగాథలు ఉండాలి.. పశ్చాత్తాపపు చరిత్రలు కాదు.ఇప్పుడే మేల్కొందాం. పిల్లలను గమనిద్దాం. వారితో మాట్లాడుదాం. తప్పు దారిలో అడుగు పడకముందే వారి చేతిని పట్టుకుందాం. అదే తల్లిదండ్రుల అసలైన బాధ్యత.. అదే సమాజ భవిష్యత్తుకు భద్రత.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588